ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనంతపురం

జిల్లా వార్తలు

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

అంతంటివి.. ఇంతంటివి..!

ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేపట్టిన జగన్‌రెడ్డి గుంతకల్లు నియోజకవర్గ ప్రజలకు ఇవ్వని హామీ అంటూ లేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని ఘంటాపథంగా చెప్పారు. కానీ ఈ ఐదేళ్లలో ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదు. స్థానిక ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి వాటిని నెరవేర్చడానికి ఏమాత్రం ప్రయత్నించిన దాఖలాలు లేవు. ఆసియాలోనే పేరుగాంచిన ఏసీఎస్ మిల్లును తెరిపిస్తామన్నారు. హంద్రీనీవాను విస్తరిస్తామన్నారు. పామిడిలో టెక్స్‌టైల్ పార్కు, గుంతకల్లులో మురుగునీటి వ్యవస్థ, గుత్తి, పామిడిలో తాగునీటి సమస్య పరిష్కారం, గుత్తి పర్యాటక అభివృద్ధి, మైనార్టీ విద్యార్థులకు వసతి భవనాలు... ఇలా లెక్కలేనన్ని హామీలను ఇచ్చి గాలికి వదిలేశారు.



ట్రాఫిక్ సమస్యగా మారిన కసాపురం రోడ్డులోని రైలు వంతెన

ఏమీ పట్టించుకోలేదేం జగనన్నా..?

పాదయాత్రలో ప్రజలకు శుష్క వాగ్దానాలు

గుంతకల్లు, గుత్తి, పామిడిలో సమస్యల మోత

ఏసీఎస్ మిల్లు తెరవలేదు.. ట్రాఫిక్ రద్దీ తగ్గలేదు

చెరువులకు నీరు రాలేదు.. దాహార్తి తీరనేలేదు



నీరులేని గుత్తి చెరువు

గుంతకల్లు, ఏప్రిల్ 18: ప్రతిపక్ష నేతగా పాదయాత్ర చేపట్టిన సందర్భంగా వైఎస్ జగన్. గుత్తిలో నిర్వహించిన బహిరంగ సభలో లెక్కలేనన్ని హామీలను గుప్పించారు. చెప్పినవేవీ నెరవేర్చకపోగా అన్ని హామీలూ పూర్తయ్యాయన్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు. ఏసీఎస్ మిల్లు, హంద్రీనీవా విస్తరణ, పామిడి గార్మెంట్స్ పరిశ్రమ, రాగులపాడు వద్ద నుంచి చెరువులకు సాగునీటి కాల్వ.. ఇలా చెప్పుకుంటూ పోతే ప్రతి విషయంలోనూ హామీలను నెరవేర్చలేక చేతులెత్తేశారు.

పత్తాలేని విస్తరణ

హంద్రీనీవా కాల్వ వెడల్పు చేసే పనులను చంద్రబాబునాయుడు పూర్తి చేయలేకపోయారని, తాను పూర్తిచేసి కాల్వలో పెద్ద ఎత్తున నీటిని పారిస్తానని జగన్‌రెడ్డి హామీ ఇచ్చారు. చంద్రబాబు హయాంలో తొలి దశ హంద్రీనీవా కాల్వను మల్యాల పంపు హౌస్ నుంచి జీడిపల్లి రిజర్వాయరు వరకూ వెడల్పు చేయడానికి రూ.900 కోట్లతో 2013 నుంచి పనులను చేపట్టారు. 2018లో చంద్రబాబు పామిడిలో హంద్రీనీవా వెడల్పు పనుల పైలాన్‌ను ఆవిష్కరించారు. పనులను శరవేగంగా చేపట్టి 80 శాతం పూర్తిచేశారు. మిగిలిన పనులను జగన్ పట్టించుకోలేదు.

పామిడి టెక్స్‌టైల్ పార్కేదీ..?

పామిడిలోని టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటుచేసి స్థానిక మహిళలకు శిక్షణనిస్తామని, స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామంటూ జగన్ హామీ ఇచ్చారు. కానీ పట్టించుకోలేదు. పైగా అక్కడ టీడీపీ నాయకుడు జీవానందరెడ్డి నిర్మిస్తున్న గార్మెంట్స్ పరిశ్రమకు ఎన్నో అవాంతరాలు కల్పించారు. కార్యకర్తలతో గొడవలు తలెత్తేలా చేసి అడ్డుకోవడానికి యత్నించారు. చిరు వ్యాపారులకు పన్ను లేకుండా వ్యాపారాలు చేసుకోవడానికి అవకాశాలను కల్పిస్తామన్నారు. అదీ నెరవేర్చలేదు.

తీరని దాహం

గుత్తి, పామిడి పట్టణ వాసులకు తాగునీటిని టీడీపీ ప్రభుత్వం అందించలేదని, తాము అధికారంలోకి వచ్చి నీటి కష్టాలు తీరుస్తామంటూ జగన్ హామీ గుప్పించారు. కానీ ఇప్పుడు గుత్తిలో పక్షం రోజులకోసారి నీరు వస్తోంది. గుత్తి మున్సిపల్ పరిధిలో శాశ్వత తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జేఐబీ రుణం రూ.173 కోట్లతో మిడ్ పెన్నార్ ప్రాజెక్ట్ మంజూరయింది. ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసి సంపూర్ణ తాగునీటిని అందిస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు హామీలు గుప్పించారు. ప్రాజెక్ట్ ప్రారంభమై ఐదేళ్లు కావస్తున్నా పనులు పూర్తి కాలేదు. గుత్తి-అనంతపురం రోడ్డులో 11ఎంఎల్‌టీ సామర్థ్యం గల వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్, నూరసింగనపల్లి, చెర్లోపల్లి, బీసీ కాలనీ వద్ద ఓవర్ హెడ్ ట్యాంక్‌లు నిర్మాణాలు చేపట్టారు. మిడ్ పెన్నార్ జలాశయం నుంచి గుత్తి వరకు పైప్‌లైన్ నిర్మించాలి. గుత్తి నుంచి గుత్తిఆర్ఎస్ వరకు అరకొర పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారు. మిడ్ పెన్నార్ ప్రాజెక్ట్ పనులు నిధుల కొరత కారణంగా పూర్తిగా నిలచిపోయాయి. దీంతో ఈ ప్రాజెక్ట్ పనులు ఎప్పుడు పూర్తి అవుతాయో స్పష్టత లేదు. పామిడిలోనూ తాగునీటి కష్టాలు తీరలేదు. టీడీపీ హయాంలో రూ.150 కోట్లతో తాగునీటి కష్టాలను తీర్చడానికి పథకాన్ని రూపొందించారు. ఎన్నికలు రావడంతో చేపట్టలేకపోయారు. జగన్ అధికారంలోకి వచ్చి ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించారు.

14 చెరువులకు నీరేదీ..?

హంద్రీనీవాపై రాగులపాడు గ్రామం సమీపంలో తూమును ఏర్పాటుచేసి కాల్వను తవ్వి వజ్రకరూరు, గుంతకల్లు మండలాలలోని 14 చెరువులకు నీరిస్తామని హామీ ఇచ్చారు. ఇందుకు రూ.40 కోట్లు మంజూరయ్యాయని ప్రకటించారు. కొనకొండ్ల వద్ద ఆర్భాటంగా పనులకు శంకుస్థాపన చేశారు. రెండున్నరేళ్ల నుంచి అతీగతీ లేదు. నిధులు విడుదల కాకపోవడంతో చెరువులకు నీరిచ్చే కార్యక్రమం అంగుళం కూడా కదలలేదు.

టూరిజం హబ్ ఏదీ..?

గుత్తిలో టూరిజం హబ్‌ను ఏర్పాటు చేస్తామని, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామని, గుత్తి చెరువుకు నీరిస్తామంటూ జగన్ హామీలు ఇచ్చారు. ఇం దులో ఒక్కటీ నెరవేరలేదు. గుత్తి కోట పర్యాటక అభివృద్ధి పనులు చేపట్టలేదు. గుత్తిలో ప్రభుత్వ డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల, టీడీడీ కల్యాణమండపం, ఆసుపత్రి లో రక్తనిధి, స్కానింగ్ సెంటర్, గుత్తి ఆర్ఎస్‌లో షైనార్టీ ఖానా.. ఇలాంటి హామీలన్నీ అటకెక్కాయి.




ఊబిచెర్లలో తాగునీటి సమస్య

ట్రాఫిక్ సమస్య అలాగే..

గుంతకల్లులో ధర్మవరం గేటు వద్ద, కసాపురం రోడ్డులో రైల్వే వంతెనల సమస్యను పరిష్కరిస్తామని జగన్ ప్రకటించారు. ధర్మవరం గేటు వద్ద ఆర్‌యూబీని నిర్మిస్తామని, కసాపురం వంతెనను వెడల్పు చేస్తామని ప్రచారం చేశారు. కానీ ధర్మవరం గేటు వద్ద సమస్యను మరింత జటిలం అయ్యేలా ఆర్‌యూబీ ప్లాన్‌ను మార్చుచేసి ప్రజల నెత్తిన రుద్దడానికి ప్రయత్నించారు. కసాపురం వంతెన పనుల విషయంలో ఎటువంటి పురోగతీ లేకుండాపోయింది.

ఏసీఎస్ మిల్లు తెరిపిస్తానని



ఏసీఎస్ మిల్లు

గుంతకల్లులో ఆసియాలోకే అతి పెద్ద ఆంధ్రా కో-ఆపరేటివ్ స్పిన్నింగ్ (ఏసీఎస్) మిల్లును తెరిపిస్తామని జగన్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ మిల్లు 1991లో మూతపడింది. గడచిన ఐదేళ్లలో స్థానిక ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి గాని, జగన్ గాని మిల్లును తెరిపించేందుకు ఎలాంటి చర్యా చేపట్టలేదు. అందులో ప్రత్యామ్నాయంగా గార్మెంట్స్ పరిశ్రమను ఏర్పాటుచేస్తామని, 16 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలను కల్పిస్తామని ఇచ్చిన హామీ నీటి మీద రాత అయ్యింది. మిల్లులో పనిచేసే 1,265 మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. తమ పిల్లలకైనా ఉద్యోగాలు వస్తాయని ఆశించి భంగపడ్డారు.

మురుగునీటి పథకం ఎక్కడ..?

గుంతకల్లులో మురుగు నీటిని శుద్ధి చేసి పంట పొలాలకు అందించే సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం పనులు మూలనపడ్డాయి. ఈ పథకం ముసుగులో వైసీపీ నాయకులు భూదందాచేసి లబ్ధి పొందారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం కోసం అమృత్ పథకం నిధుల కింద రూ.26.71 కోట్లు మంజూరు చేశారు. సత్యనారాయణ పేటలోని శశ్మాన వాటిక సమీపంలో ప్లాంట్ నిర్మాణం కోసం చర్యలు చేపట్టారు. రెండున్నర ఎకరాల స్థలం అవసరమయింది. అక్కడ స్థలం లేకపోవడంతో ఓ పొలం యాజమానితో సంప్రదింపులు జరిపారు. అతడి స్థలం మున్సిపాలిటీకి ఇచ్చేందుకు ససేమిరా అన్నట్లు తెలిసింది. దీంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించలేదు. అతని టెండర్‌ను రద్దు చేశారు. 2019లో వైసీపీ అధికారంలో రావడంతో తిరిగి టెండర్లను పిలిచారు. వైసీపీకి చెందిన భూమి యాజమానితో వైసీపీ ప్రజా ప్రతినిధులు చర్చలు జరిపారు. అతడి స్థలం తీసుకుని, మున్సిపాలిటీ స్థలం అతనికి ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. విలువ తక్కువగా ఉన్న భూమికి బదులు, ఎంతో విలువైన మున్సిపల్ భూమిని అతడికి కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. 2021 జనవరి 4న ప్లాంట్ నిర్మాణానికి ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి భూమి పూజ చేశారు. మూడు సంవత్సరాల నుంచి పనులు ముందుకు సాగలేదు. ప్లాంట్ డిజైన్, డ్రాయింగ్ అనుమతులు రావాల్సి ఉంది. భూమి శ్యాంపిల్‌ను అనంతపురంలోని ల్యాబ్‌కు పంపారు. కాంట్రాక్టర్ ప్రస్తుతం ప్లాంట్ నిర్మాణం కోసం స్థలాన్ని చదును చేసి, కొన్ని పైపులను తెప్పించారు. అంతే తప్ప పనులు ముందుకు సాగలేదు.

పిడుగుపాటుకు వ్యవసాయకూలీ మృతి



వినోద్(ఫైల్)

ఉరవకొండ, ఏప్రిల్ 18: వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో గురువారం సాయంత్రం పిడుగుపాటుకు వ్యవసాయకూలి వినోద్(23) మృతి చెందాడు. గ్రామ సమీపంలోని మిరప తోటలో పని ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో చిన్నపాటి వర్షం మొదలైంది. అదే సమయంలో పిడుగు పడడంతో వినోద్ కుప్పకూలిపోయాడు. సమీపంలో ఉన్నవారు గమనించి వెంటనే ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

జగన్‌కు ఓటేస్తే చేతికి చిప్పే..!

- విరుచుకుపడ్డ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి
- శింగనమల, ఉరవకొండలో న్యాయ యాత్ర సభలు

బుక్కరాయసముద్రం/ఉరవకొండ, ఏప్రిల్ 18: జగన్‌కు ఓటు వేస్తే ప్రతి ఒక్కరి చేతికి చిప్ప ఇస్తారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. నార్పల, ఉరవకొండలో గురువారం నిర్వహించిన 'కాంగ్రెస్ న్యాయ యాత్ర' బహిరంగ సభలలో ఆమె ప్రసంగించారు. జగన్‌ను నమ్మి గద్దెనెక్కిస్తే రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని విమర్శించారు. శింగనమల నియోజకవర్గం ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం విస్మరించారని అన్నారు. ఈ నియోజకవర్గం ఉద్యానశాఖకు ప్రసిద్ధి అని అన్నారు. 'ఈ ప్రాంతంలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేస్తామని అన్నారు. కాలువలు అభివృద్ధి చెస్తామన్నారు. ఉద్యాన పంటలకు కనీస మద్దతు ధర ఇస్తామన్నారు. పరిశ్రమలు తెస్తామన్నారు. ఇదే నార్పలలో కోట్లాది రుపాయల నిధులు మంజూరు చేస్తున్నట్లు తప్పుడు వాగ్దానాలు ఇచ్చారు. ఒక్క హామీ కూడా నేరవేర్చలేదు' అని సీఎం జగన్‌ను విమర్శించారు. మోసకారి జగన్‌కు ఓటు అడిగే హక్కు లేదని అన్నారు. ఉరవకొండలో జరిగిన సభలో షర్మిల మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో హంద్రీనీవా పనులు 90శాతం పూర్తి చేశారని, టీడీపీ, వైసీపీ పాలనలో మిగిలిన 10 శాతం పనులను పూర్తి చేయలేకపోయారని అన్నారు. అధికారంలోకి వస్తే ఆరు నెలల్లో హంద్రీనీవా పనులను పూర్తి చేస్తామని ఉరవకొండ జలదీక్షలో జగన్ హామీ ఇచ్చారని, ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. వీరా వైఎస్సార్ వారసులు అని ప్రశ్నించారు. 'మీ రాజశేఖర్ రెడ్డి బిడ్డగా అడుగుతున్నా.. కాంగ్రెస్‌కు ఓటు వేయండి' అని కోరారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాతో పాటు, రైతులకు రూ.2 లక్షల వరకూ రుణమాఫీ, ప్రతి కుటుంబానికి ఐదు సంవత్సరాలలో రూ.5 లక్షలు, ఉపాధి కూలీల రోజుకు రూ.400 కూలి ఇస్తామని అన్నారు.

- శింగనమల నియోజకవర్గంలో ఏ ఒక్క రాజకీయ నాయకుడికీ ఓటు అడిగే హక్కులేదని కాంగ్రెస్ పార్టీ శింగనమల అభ్యర్థి శైలజానాథ్ అన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న పదేళ్లలో చేసిన అభివృద్ధి నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా కనుపడుతుందని అన్నారు.
- తన సోదరుడు విశ్వ కోసం 30 ఏళ్లు పనిచేశానని, అందుకు ప్రతిఫలంగా తన మీద, తన కుమారుడి మీద కేసులు పెట్టించారని ఉరవకొండ అభ్యర్థి మధుసూదన్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను సీటు కోసం ఏనాడూ పోటీ పడలేదని అన్నారు. వైఎస్సార్‌కు విశ్వేశ్వరరెడ్డిని పరిచయం చేశానని అన్నారు. గాలి మరలలో విశ్వ రూ.కోట్లు సంపాదించారని ఆరోపించారు. 40, 60 శాతం కమీషన్ల కోసం పనిచేశారని విమర్శించారు.

సభలలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లికార్జున, వామపక్ష నాయకులు కేశవరెడ్డి, మల్లి కార్జున, రంగారెడ్డి, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదా గాంధీ, డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, సీపీఐ అనంతపురం నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, సీపీఎం జిల్లా నేత నల్లప్ప పాల్గొన్నారు.



నార్పల సభకు హాజరైన జనం..



ఉరవకొండలో జనానుద్దేశించి మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

నేడు చంద్రబాబు ప్రజాగళం

కణేకల్లులో బహిరంగ సభ

చంద్రబాబు జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు శుక్రవారం జిల్లాకు వస్తున్నారు. రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కణేకల్లులో ఆయన ప్రజాగళం బహిరంగ సభలో పాల్గొంటారు. కణేకల్లులోని రామ్‌నగర్ నుంచి మూడురోడ్ల కూడలి వరకూ రోడ్ షో ఉంటుంది. అక్కడ బహిరంగ సభ నిర్వహిస్తారు. అనంతరం కణేకల్లులోనే రాత్రికి చంద్రబాబు బస చేస్తారు. టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు సభ ఏర్పాట్లను గురువారం పర్యవేక్షించారు. కణేకల్లు క్రాస్‌లో హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. కణేకల్లులో గురువారం టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించిన కాలవ శ్రీనివాసులు, పెద్ద ఎత్తున జన సమీకరణ చేపట్టాలని ఆదేశించారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాలలోని అన్ని గ్రామాల నుంచి 20 వేల మంది తగ్గకుండా కార్యక్రమానికి వచ్చేలా చూడాలని సూచించారు. వాహనాలను ఇప్పటికే సిద్ధం చేశారు. బహిరంగ సభ శుక్రవారం సాయంత్రం ఉంటున్నందున.. మధ్యాహ్నానికి కణేకల్లుకు చేరుకునేలా చూడాలని సూచించారు. టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను శనివారం కణేకల్లులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యానికేతన్ కాలేజ్ వద్ద బస చేస్తున్న ఆయన, శనివారం ఉదయం తిరుగు ప్రయాణమౌతారు. ఆ రోజున చంద్రబాబు పుట్టిన రోజు కావడంతో వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.

ఎన్నికలకు నోటిఫికేషన్

తొలిరోజు తొమ్మిది నామినేషన్లు

అనంత ఎంపీ స్థానానికి రెండు

రాప్తాడులో ఒకటి.. అర్బన్‌లో నాలుగు

శింగనమల, తాడిపత్రిలో ఒక్కొక్కటి..

అనంతపురం టౌన్/క్రైం/రాప్తాడు, ఏప్రిల్ 18: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్ కుమార్ గురువారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. దీంతో ఒక పార్లమెంటు, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తామని కలెక్టర్ తెలిపారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన జరుగుతుందని, 29వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. మే 13 పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటాయని అన్నారు. జూన్ 6వ తేదీనాటికి ఎన్నికల ప్రక్రియ ముగిసి, కోడ్ ఎత్తివేస్తామని తెలిపారు. ఎన్నికలలో ప్రతి ఒక్కరూ నిబంధనలను పాటించాలని కోరారు.

తొలిరోజు సందడి

జిల్లా వ్యాప్తంగా తొలిరోజు గురువారం నామినేషన్ల సందడి కనిపించింది. అనంతపురం ఎంపీ స్థానానికి రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్ కుమార్ స్వయంగా ఎంపీ అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. ఎస్‌యూసీఐ అభ్యర్థిగా అనంతపురం ఆజాద్ నగర్‌కు చెందిన నాగముత్యాలు, స్వతంత్ర అభ్యర్థిగా శ్రీరంగనాథుల గోపీనాథ్ నామినేషన్లు వేశారు. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో తొలిరోజు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. ఉరవకొండలో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్ తరపున ఆయన సతీమణి స్నేహలత నామినేషన్ దాఖలు చేసారు. శింగనమలలో టీడీపీ అభ్యర్థి బండారుశ్రావణి కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులు నామినేషన్ దాఖలు చేశారు. రాప్తాడు అభ్యర్థిగా కనగానపల్లి మండలం రాంపురం గ్రామానికి చెందిన ప్రొఫెసర్ రాజేష్ నామినేషన్ దాఖలు చేశారు. అనంతపురం అర్బన్‌లో వైసీపీ అభ్యర్థి అనంతవెంకటరామిరెడ్డి తరపున కుటుంబ సభ్యులు రెండు సెట్ల నామినేషన్‌లు వేశారు. ఒక స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. తాడిపత్రిలో వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి తరపున ఆయన కుమారుడు ఒకసెట్ నామినేషన్ దాఖలు చేసారు. అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో అర్బన్‌లో అసెంబ్లీ అభ్యర్థుల నుంచి రిటర్నింగ్ అధికారి గ్రంధి వెంకటేష్ నామినేషన్లను స్వీకరించారు.



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్

వేడెక్కిన రాజకీయం

నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం

- ఆర్భాటంగా దాఖలుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- ప్రచారంలో కూటమి అభ్యర్థుల దూకుడు
- హామీలు నెరవేర్చలేని వైసీపీలో అయోమయం
- ఓటమి భయంతోనే కవ్వింపు చర్యలకు శ్రీకారం
- కూటమి శ్రేణులను అప్రమత్తం చేస్తున్న ముఖ్యనేతలు
- అధికారుల పనితీరుపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా

అనంతపురం ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల కావడంతో జిల్లాలో రాజకీయం మరింతగా వేడెక్కింది. తొలి రోజే నామినేషన్ల ప్రక్రియకు పలువురు ఎమ్మెల్యే అభ్యర్థులు శ్రీకారం చుట్టారు. ఎలాంటి హంగు ఆర్భాటం లేకుండా కుటుంబ సభ్యులు, పార్టీ ముఖ్యనాయకులతో కలిసి కూటమి అభ్యర్థులు, అధికార వైసీపీ అభ్యర్థుల తరఫున తొలి రోజు ఒకటి, రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఒకరిద్దరు అభ్యర్థులు స్వయంగా నామినేషన్లు దాఖలు చేశారు. పార్లమెంట్ అభ్యర్థులదీ ఇదే పరిస్థితి. కాగా భారీ జన సమీకరణతో ఆర్భాటంగా నామినేషన్ దాఖలు చేయడానికి అధికార, ప్రతిపక్ష పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. నామినేషన్ సమయంలోనే బలాన్ని చూపించుకునేందుకు అభ్యర్థులు సమాయత్తమవుతున్నారు.

గెలుపే లక్ష్యంగా వ్యూహరచన

గెలుపే లక్ష్యంగా జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు వ్యూహ రచన చేస్తున్నారు. విజయానికి తోడ్పడే అన్ని అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణను రూపొందించు కుంటున్నారు. ముఖ్యంగా ఉద్యోగులు, యువత, మహిళలు, రైతులు, కార్మికుల్లో చైతన్యం నింపే దిశగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. అధికార వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏ వర్గానికి న్యాయం చేయలేదన్న విషయాన్ని ప్రజలకు బలంగా వివరిస్తున్నారు. కూటమికి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామనే భరోసాను ఇస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గరపడేకొద్దీ ప్రచారంలో మరింత దూకుడు పెంచాలనే యోచనలో కూటమి అభ్యర్థులు ఉన్నారు. పోలింగ్‌కు మూడు వారాల గడువు ఉన్న నేపథ్యంలో... కూటమి నాయకులు, కుటుంబ సభ్యులు, అభ్యర్థులు, తలా ఓ ప్రాంతంలో ఇంటింటి ప్రచారం చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల విజయానికి తీవ్రంగా కృషి చేస్తున్నారు.

మాటలే.. చేతలు లేవు

రాష్ట్రంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమిదే అధికారమని సర్వేలన్నీ స్పష్టం చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోని అధికార వైసీపీ అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది. జిల్లాలోనూ అధికార వైసీపీకి 2 నుంచి 3 స్థానాల కంటే ఎక్కువ సీట్లు రావని సర్వేలు తేలుస్తున్న క్రమంలో ఆ పార్టీ అభ్యర్థులను ఓటమి భయం వెంటాడుతోంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో బటన్ నొక్కుడు తప్పా ఏ ఒక్క అభివృద్ధి పనులు చేయకపోగా... ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ జిల్లాకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. ఇక స్థానికంగా గత ఎన్నికల సందర్భంగా ఆ పార్టీ అభ్యర్థులు ఇచ్చిన హామీలు నెరవేర్చలేకపోయారు. ఉదాహరణకు అనంతపురం అర్బన్‌లో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని సిట్టింగ్ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఐదేళ్ల పాలన ముగుస్తున్నా... ఆ హామీ నెరవేర్చలేకపోయారు. ఇలా జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. పరిశ్రమలు ఏ ఒక్కటి తీసుకురాలేదు. ఏ ఒక్కరికి ఉద్యోగాలు కల్పించలేదు. బటన్ నొక్కే సొమ్ము అయినా ఆయా వర్గాల లబ్ధిదారులకు సకాలంలో అందించడం లేదు. ఉద్యోగ వర్గాలకు ఒకటో తేదీ జీతాలు ఇవ్వడంలోనూ ప్రభుత్వం చేతులెత్తేసింది. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా మంజూరులోనూ అన్యాయమే జరిగింది.


కేశవ్ తరపున నామినేషన్ వేస్తున్న కుటుంబ సభ్యులు


శింగనమలలో నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న శ్రావణిశ్రీ


దగ్గుబాటి తరపున నామినేషన్ వేస్తున్న శ్రీనివాసులు

కవ్వింపు చర్యలకు వైసీపీ శ్రీకారం

రైతులు, మహిళలు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాలు అధికార వైసీపీపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికార పార్టీ అభ్యర్థులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. కళ్యాణదుర్గం నియోజక వర్గం కేంద్రంలో గురువారం జరిగిన పరిణామాలే ఇందుకు నిదర్శనం. ప్రచారంలో భాగంగా ప్రజల మధ్యకు వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్న కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు, శ్రేణులపై స్థానిక వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్య వర్గీయులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంఘటన నేపథ్యంలో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కూటమి అభ్యర్థులు కూటమి పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు.


కవ్వింపు చర్యలకు పాల్పడుతున్న వైసీపీ శ్రేణులు

పోలీసుల పారదర్శకతపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా

సార్వత్రిక ఎన్నికలను పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నది ఎన్నికల కమిషన్ ముఖ్య ఉద్దేశ్యం. అది నెరవేరుతోందా..? లేదా అనేదానిపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా ఉంచినట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ విడుదలతోనే జిల్లా యంత్రాంగం మొత్తం ఎన్నికల కమిషన్ పరిధిలోకి వెళ్లింది. ఇక నోటిఫికేషన్ విడుదలతో పూర్తి స్థాయిలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అధికార యంత్రాంగం, పోలీసులు విధులు నిర్వర్తించాల్సి ఉంది. అయితే కొందరు అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. తాజాగా కళ్యాణదుర్గంలో వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడిన ఘటన నేపథ్యంలో పోలీసు అధికారులపై ఎన్నికల కమిషన్ ప్రత్యేక నిఘా పెట్టినట్లు సమాచారం. పారదర్శకంగా పని చేయని అధికారులపై చర్యలు తీసుకునేలా ఎన్నికల కమిషన్ పరిధిలోని ప్రత్యేక బృందాలు క్షేత్ర స్థాయిలో నిఘాను మరింతగా పెంచినట్లు తెలిసింది.

ఓటరుకు సాంకేతిక సహకారం

అందుబాటులో వివిధ యాప్‌లు.. పారదర్శక నిర్వహణకు మార్గాలు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 18 : ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సాంకేతికను వినియోగిస్తోంది. ఓటర్లు, అభ్యర్థుల వివరాలు తెలుసుకునేందుకు, ఫిర్యాదులు చేసేందుకు, ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక యాప్‌లు, పోర్టల్‌లు, వెబ్‌సైట్‌లను అందుబాటులోకి తెచ్చింది. వీటి ద్వారా ఓటర్లకు సమస్త సమాచారం అందుబాటులో వుంచింది. పోటీచేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల సభలు, సమావేశాలు, ప్రదర్శనల నిర్వహణ కోసం అనుమతులు తీసుకునేందుకు కూడా వీటి ద్వారా అవకాశం కల్పించింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులకు ఉపయోగపడేలా మరిన్ని యాప్‌లు వున్నాయి.

ఓటరు సాయానికి వీహెచ్ఎస్



ఓటర్ల సమాచారాన్ని తెలుసుకునేందుకు వీలుగా ఓటరు హెల్ప్‌లైన్ యాప్ (వీహెచ్‌ఏ)పేరిట ప్రత్యేక వ్యవస్థను ఎన్నికల సంఘం రూపొందించింది. ఇందులో ఓటు నమోదు చేసుకునేందుకు వీలుగా దరఖాస్తులు అందుబాటులో వుంటాయి. ఓటరు జాబితాలో పేర్లు ఉన్నాయా లేదా అన్నది సులువుగా తెలుసుకోవచ్చు. ఈ-ఎపిక్ కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ఫిర్యాదులకు ప్రత్యేకం ఎన్జీఎస్



ఓటర్లు ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు చేసేందుకు నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ (ఎన్జీఎస్) పేరిట ఒక పోర్టల్ వుంది. ఓటర్ల జాబితాకు సంబంధించిన ఫిర్యాదులను ఇందులో నమోదు చేయవచ్చు. దేశవ్యాప్తంగా ఏ నియోజకవర్గానికి చెందిన ఫిర్యాదులైనా ఇందులో నమోదు చేయవచ్చు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ వివరాలను పొందుపరిస్తే సంబంధిత నియోజకవర్గ అధికారులు వీటిని పరిశీలించి చర్యలు చేపడతారు.

అభ్యర్థి గురించి తెలుసుకోండిలా..



మీ అభ్యర్థి గురించి తెలుసుకునేందుకు నో యువర్ క్యాండిడేట్, కేవైసీ పేరిట ఒక వెబ్‌సైట్ వుంది. అభ్యర్థులు నామినేషన్ల సందర్భంగా దాఖలు చేసే ప్రమాణ పత్రాల (అఫిడవిట్‌లు) ప్రజలకు అందుబాటులో వుంచేందుకు ఎన్నికల సంఘం ఈ వెబ్‌సైట్‌ను రూపొందించింది. పోటీలో వున్న అభ్యర్థి ఎలాంటి వారు, వారికి నేర చరిత్ర ఏమైనా వుందా. వారికి ఏయే ఆస్తులు ఎక్కడెక్కడ వున్నాయి. స్థిర చరాస్తుల వివరాలు, బంగారు ఆభరణాల వివరాలను తెలుసుకోవచ్చు

సి-విజిల్‌తో అక్రమాలకు చెక్



ఎన్నికల్లో ప్రలోభాలు, అక్రమాలను అరికట్టేందుకు ఉద్దేశించిన యాప్ ఇది. ప్రజలు తాము గుర్తించిన అక్రమాలను సి-విజిల్ యాప్‌లో సంక్షిప్తంగా నమోదు చేయాలి. వంద నిమిషాల వ్యవధిలో అధికారులు ఆ ప్రదేశానికి చేరుకుని సమాచారం ఆధారంగా చర్యలు తీసుకుంటారు. తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదు చేసిన వ్యక్తి ఫోన్‌కు మెసేజ్ రూపంలో తెలుపుతారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా వుంచడం ఈ యాప్ ప్రత్యేకత.

దివ్యాంగుల చేయూతకు 'సాక్ష్యం'



వయో వృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం సాక్ష్యం యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోలింగ్ కేంద్రానికి సొంతంగా రాలేని వారు ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. నమోదు చేసుకున్న వారిని పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చేందుకు అధికారులు రవాణా సదుపాయాన్ని కల్పిస్తారు. ప్రత్యేకంగా వలంటీర్‌ను అందుబాటులో వుంచుతారు. దివ్యాంగుల కోసం చక్రాల కుర్చీని సమకూర్చుతారు.

హామీల్లోనే 'తోపు'

ఒక్కటీ నెరవేర్చని ప్రకాష్‌రెడ్డి
కాలనీకి ఇచ్చిన హామీలు మరిచిపోయారు
రోడ్లు, కాలువలు ఒట్టి మాటలే
ఎమ్మెల్యే తోపుదుర్తిపై సదాశివన్ కాలనీ వాసుల ఆగ్రహం


కాలనీలోని మట్టి రోడ్డు


రోడ్డు కంటే దిగువలో ఉన్న ఇళ్లు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 18: 'మా పార్టీకి ఓటేసి గెలిపించండి. మీ కాలనీలో సమస్యలన్నీ తీరుస్తా' ఇది అనంతపురంరూరల్ మం డలం అక్కంపల్లి పంచాయతీలోని సదాశివన్ కాలనీ ప్రజలకు 2019 లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఇచ్చిన హామీ. దీన్ని నమ్మి ఆ కాలనీలో ఉండే పేదలంతా వైసీపీకి ఓటేశారు. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఎమ్మెల్యే హోదాలో కాలనీకి వచ్చిన తోపుదుర్తి ఆరు నెలల్లో కాలనీ రూపురేఖలు మార్చేస్తామని హామీ ఇచ్చారు. రోడ్లు, కాలువలు, స్కూల్ ఇతరత్ర అన్నీ ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. అంతే ఆ తర్వాత ఏళ్లు గడిచినా ఆ కాలనీవైపు తొక్కి తొంగిచూడలేదు. ఇచ్చిన హామీలు నెరవేర్చిందిలేదు. అబద్ధపు హామీలు ఇచ్చి, మమ్మల్ని ఇంతగా మోసం చేస్తావా అని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ ఏర్పాటై పదేళ్లు దాటిపోయింది..

వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారితో 2012లో కాలనీ ఏర్పడింది. దాతల సాయంతో కొంత వరకు విద్యుత్ సౌకర్యం పొందారు. స్థానికులంతా కలిసి బోరు వేసుకున్నారు. ఇప్పుడు కాలనీలో 250 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. మొదట్లో ఇతర ప్రాంతాల నుంచి రావడంతో స్థానికంగా గుర్తింపు కార్డులు లేపోవడం..స్థానికులమని చెప్పుకొనే పరిస్థితి వారికి లేకుండా ఉండేది. క్రమేనా ఆధార్, ఓటరు కార్డులు ఇతరత్ర కార్డులన్నీ పొందారు. గత ఎన్నికల్లో తమ ఓటు హక్కును కూడా వినియోగించుకున్నారు. దీంతో స్థానికులు కాలనీలో తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోడ్లు, కాలువలు, ఇళ్లకుపట్టాలు, చెక్ డ్యాం దగ్గరగా ఉండటంతో ప్రహరీ నిర్మిస్తామని ఎమ్మెల్యే తోపుదుర్తి హామీ ఇచ్చినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కాగా స్థానికంగా ఉన్న మట్టి రోడ్లను తవ్వి చెరువులోని బంక మట్టిని తోలి స్థానిక సర్పంచు సొమ్ము చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ మట్టిని తోలడం వల్ల వర్షం వస్తే అడుగు తీసి అడుగు పెట్టే పరిస్థితి ఉండదని, దీనికితోడు ఇళ్ల కంటే రోడ్డే ఎత్తుగా ఉండటంతో వర్షపునీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాలనీ అంతా వైసీపీలో చేరాం



తమ సమస్యలు తీరుతాయన్నా ఆశతో కాలనీ మొత్తం వైసీపీలో చేరాం. స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ఇళ్లకు పట్టాలు ఇస్తాం, రోడ్లు, కాలువలు వేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో తిరిగి పది ఇరవై రోజుల తరువాత ఎమ్మెల్యే ఇంటి వద్దకు కొంత మందితో వెళ్లాం. పట్టాలు ఇవ్వలేం. కామరుపల్లి వద్ద జగనన్న కాలనీలో ఇస్తామని చెప్పారు. స్థానికంగా ఇల్లు కట్టుకున్నాం ఎక్కడికీ వెళ్లలేమని చెప్పాం అంతే. మరి ఆయన దగ్గరకు వెళ్లింది లేదు. ఆయన కాలనీకి వచ్చిందీ లేదు.

- మజ్జిగ నారాయణ, స్థానికుడు

ఆరు నెలల్లో ప్రహరీ నిర్మిస్తామన్నారు



పదేళ్లుగా ఇక్కడే నివాసముంటున్నాం. గత ఎన్నికల అనంతరం ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చి రోడ్లు, కాలువలు, కాలనీ చెక్‌డ్యాంకు దగ్గరగా ఉండటంతో ఆరు నెలల్లో ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని చెప్పారు. మళ్లీ ఎన్నికలే వచ్చాయి కానీ ఆయన ఇచ్చిన హామీ మాత్రం నెరవేరలేదు.

- పోతన్న, స్థానికుడు

ఏంటి గురూ.. ఇదంతా..!

సచివాలయ ఉద్యోగులకు తీవ్ర పని ఒత్తిడి
అరకొర సిబ్బందితో ఇబ్బంది పడుతున్న వైనం
జీతాల కోసం పలువురు ఉద్యోగుల నిరీక్షణ
సమస్య చెబితే క్లాస్ పీకుడే!
పామిడి సచివాలయ ఉద్యోగుల దీన స్థితి

పామిడి పని ఒత్తిడి, జీతాలు రాకపోవడంతో పామిడిలోని సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పామిడి పంచాయతీలో ఏడు సచివాలయాలు ఏర్పాటు చేశారు. ఒక్కో సచివాలయానికి 11 మందిని ప్రభుత్వం నియమించాల్సి ఉండగా అరకొరకగానే నియమించారు. 76మంది ఉద్యోగులు ఉండాల్సిన చోట 45 మంది(రెగ్యులర్, డెప్యుటేషన్) మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో పంచాయతీ కార్యదర్శులు ఏడుగురుకి గాను ఐదుగురు(ఈ ఓతో కలిపి) ఉన్నారు. వీరిలో నలుగురు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్లు ఏడుగురుకి నలుగురు డెప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్లు ఏడుగురికి ఆరుగురే ఉన్నారు. వీరిలో ఇద్దరు డెప్యుటేషన్, నలుగురు రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఏడుగురికి ఏడుగురు రెగ్యులర్, ఏఎన్ఎంలు ఏడుగురికి ఆరుగురు రెగ్యులర్, మహిళా పోలీసులు ఏడుగురికి ఆరుగురు రెగ్యులర్ కాగా ఒక్కరు డెప్యు టేషన్‌పై పని చేస్తున్నారు. వీఆర్వోలు ఏడుగురికి ఏడుగురు రెగ్యులర్, జూనియర్ లైన్ మెన్ ఏడుగురికి ముగ్గురు రెగ్యులర్, సర్వేయర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, వెటర్నరీ అసిస్టెంట్లు ఏడుగురికి ఒక్కరూ లేరు.

- **తీవ్ర పని ఒత్తిడి**

పామిడి సచివాలయాల్లో అరకొరక సిబ్బందితో తీవ్ర పని ఒత్తిడి నెలకొంది. దీంతో ఉన్న సిబ్బంది అత్యవసర పని నిమిత్తం సెలవులపై కూడా వెళ్లలేని దుస్థితి. ఒకవైపు ప్రభుత్వ పథకాలు, వివిధ పనులు, మరోవైపు ఎన్నికల విధులతో సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ప్రస్తుత తమ క్యాడర్‌కు... చేస్తున్న పనికి పొంతనలేకుండా పోతోందని వారు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు ఇద్దరు, ముగ్గురు చేయాల్సిన పనిని ఒక్కరితోనే చేయించడంపై వారు కలతచెందుతున్నారు. రెగ్యులర్ సచివాలయం ఉద్యోగులకు జనరల్ ట్రాన్స్‌ఫర్లు లేకపోవడం, జీతాలు రాకపోవడం, పని ఒత్తిడి కూడా పెరగడంతో కొందరు ఉద్యోగం వదిలేసేందుకు సిద్ధపడినట్లు సమాచారం. ఎన్నికల తర్వాత బదిలీలు జరుగుతాయేమోనన్న ఆశాభావంతో విధులు నిర్వర్తిస్తున్నారు.

- **జీతాలు లేవు**

పామిడి సచివాలయాలలో 45 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో సుమారు 11 మంది డెప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. డెప్యుటేషన్ వారికి మినహా ఇతరులకు జీతాలు సక్రమంగా రావడంలేదు. ఒకరిద్దరికి ఏడాది పాటు రాకపోగా మరికొందరికి పది నెలలుగా, ఇంకొందరికి కొన్ని నెలలుగా జీతాలు రాలేదని సమాచారం. ఇంజినీరింగ్, డిజిటల్ అసిస్టెంట్లుకు పదినెలలుగా, మహిళా పోలీసులకు ఐదు నెలలుగా, ఏఎన్ఎంలకు నాలుగు నెలలుగా, వీఆర్వోలకు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయి. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఇలా జీతాలు సక్రమంగా రాకపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- **సమస్యను తెలియజేసినా సమస్యే**

ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరవేయడంలో సచివాలయ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. అయితే ఆ సచివాలయ ఉద్యోగుల సమస్య పామిడిలో అరణ్య రోదనగా మారింది. తమ సమస్యలను అటు అధికారులకు చెప్పుకోలేక, ఇటు ప్రజాప్రతినిధులకు చెప్పుకోలేక వారు సతమతమవుతున్నారు. సమస్యను చెబితే అదే పెద్ద సమస్యగా మారుతోందని వారు మథనపడుతున్నారు. ఇలా ఏదైనా సమస్యను చెబితే ఆ ఉద్యోగిని ఓ అధికారి పిలిచి క్లాస్ పీకుతున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. అంతేకాకుండా ఆ ఉద్యోగి ప్రోగ్రెస్‌పై నిఘా పెట్టి తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆఖరికి తమ సమస్యను తెలిపి కాస్త ఊరట చెందుదామన్నా ఆ వెసులుబాటు కూడా లేకుండాపోయిందని వారు ఆక్రోశిస్తున్నారు.



వార్డు సచివాలయం

జీతాలు అందజేసేందుకు కృషి చేస్తాం



పామిడిని నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మార్చడంతో వార్డు సచివాలయాల క్యాడర్ స్ట్రెంత్ మంజూరు కాలేదు. దీంతో వారికి జీతాలు అందజేయడంలో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికే గతంలోని అధికారులు రాష్ట్ర సచివాలయంలో నివేదించారు. ఇది ప్రభుత్వం స్థాయిలో ఉంది. బదిలీపై కొత్తగా రావడంతో నాకు ఈ సమస్య ఇటీవలే తెలిసింది. సచివాలయం ఉద్యోగులకు జీతాలు అందించేందుకు రెండు మూడు రోజుల్లో మరోసారి రాష్ట్ర సచివాలయంలో ప్రయత్నిస్తాం.

- శ్రీనివాసరరావు, ప్రత్యేకాధికారి, పామిడి

ఎలా వస్తోంది.. పోతోంది..?

దొంగదారిలో డబ్బు, మద్యం రవాణా
ఎన్నికల్లో పంచే ఆ సొమ్ము ఎక్కడ..?
రాజకీయనాయకుల సొమ్ము పట్టుబడదా?
దొరికేదంతా వ్యాపారులు, ఇతర వర్గాలదేనా?

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఓట్ల కోసం నోట్లు వెదజల్లనున్నాయి. ప్రతి ఎన్నికలప్పుడూ ఇదంతా మామూలే. ఇలా జరుగుతోందని అందరికీ తెలిసినా ఆ డబ్బు పోలీసులకు మాత్రం దొరికినట్లు కనిపించదు. కర్ణాటక మద్యం రవాణాను కూడా ఏ శాఖ అధికారులు నియంత్రించలేకపోతున్నారు. జిల్లాలో యథేచ్ఛగా రవాణా అవుతూనే ఉంది. పోలీసులు, సెబ్, ఎక్సైజ్ ఇలా ఎవరూ దాన్ని నియంత్రించలేక పోవడంతో జిల్లా కేంద్రంతో పాటు పట్టణాలు, మండల కేంద్రాలు దాటి మారుమూల పల్లెలకు సైతం పొంగి పొర్లుతోంది. ఈ నేపథ్యంలో మద్యమే పట్టుకోలేకపో యారు...ఇక డబ్బు మూటలను ఎప్పుడు పట్టుకుంటారనే విమర్శను పోలీసులు మూటగట్టుకుంటున్నారు. ప్రస్తుతం సాధారణ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు సామాన్యుల డబ్బు లక్షల్లో సీజ్ చేసినట్లు చెబుతున్నారు కానీ రాజకీయ నాయకులకు సంబంధించిన ఒక్క పైసాకూడా పట్టుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్నికల్లో పంచే ఆ రూ.కోట్లు ఎక్కడ..?

ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి రాజకీయపార్టీలు రూ.కోట్లు వెదజల్లుతుం టాయి. ఇదంతా బహిరంగ రహస్యమే. పోలీసులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటారనే విమర్శలున్నాయి. కానీ ఆ డబ్బు ఎక్కడి నుంచి వస్తోంది..? ఎలా వస్తోంది..?ఎవరి ద్వారా ఆయా నేతలకు చేరుతోందనేది అంతుబట్టని విషయం. కొన్ని కంటైనర్ల ద్వారా ఆ డబ్బు చేరుతుందనే ప్రచారం జరుగుతుంటుం ది. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలీసులు జిల్లా సరిహద్దులు, రాష్ట్ర సరిహద్దుల్లో ముమ్మరంగా నిఘా వేశారు. కానీ రాజకీయ నాయకులకు సంబంధించిన డబ్బు ఎక్కడా పట్టుబడలేదు. ఒకవేళ పట్టుబడినా అది రాజకీయనాయకుల డబ్బు కాదని ఆ దొరికినవారు బుకాయిస్తున్నారో ఏమో తెలియదు. అయితే రాజకీయ నాయకుల ప్రమేయం ఉందనే విషయం మాత్రం బయటకు రావడం లేదు.

సాంబా వాహనంలో దొరికిన వాచీల సంగతేంటి..?

వైసీపీ నేత, శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డి వాహనంలో ఇటీవల దొరికిన వాచీల సంగతేంటనేది చర్చనీయాంశంగా మారింది. బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌లో ఉన్న సాంబశివారెడ్డిని పిలుచుకెళ్లడానికి ఆయన వాహనంలో డ్రైవర్, ఎమ్మెల్యే గన్‌మెన్ నాగేంద్రకుమార్ వెళ్తున్న కారులో సీఎం జగన్ ఫొటో ఉన్న వాచీలు తీసుకెళ్లారు. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లి చెక్‌పోస్టులో పోలీసుల తనిఖీలో ఆ వాచీలు పట్టుబడ్డాయి. ఈ ఘటనపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. పోలీస్ అధికారులు సైతం గన్‌మెన్‌ను వివరణ అడిగారట. ఆయన తనకేం సంబంధం లేదని చెప్పుకొచ్చారట. ఇక్కడితోనే ఆ వ్యవహారం ముగిసినట్లు తెలుస్తోంది. కర్ణాటక పోలీసులు ఈ విషయంపై ఎన్నికల కమిషన్‌కు నివేదిక సమర్పించారా..?ఎన్నికల కమిషన్ ఆ విషయంలో ఏం చేస్తోంది..?అనేది తెలియాల్సి ఉంది.



జగన్ ఫొటో ఉన్న వాచీ ఇదే

పోలీస్ చెక్‌పోస్టులను దాటి అక్రమంగా వెళ్తోందా..

రాజకీయనాయకులకు సంబంధించిన డబ్బు పోలీస్ చెక్‌పోస్టులను దాటి అక్రమంగా వెళ్తోందా..?అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రస్తుతం డబ్బు తీసుకెళ్తున్న వాహనాల ముందు ఓ ఎస్కార్ట్ వాహనం వెళ్తోందని సమాచారం. ఎక్కడైనా పోలీసులు తనిఖీ చేస్తున్నట్లు కనిపిస్తే దారి మళ్లిస్తున్నారని తెలుస్తోంది. అడ్డదార్లు, దొంగదార్లు తెలిసిన వారు ఇలా తీసుకెళ్తున్నారని సమాచారం. మరో వైపు రాజకీయనాయకులు డబ్బు పంపే మార్గాన్ని సైతం మార్చారనే వాదనా లేకపోలేదు. ఆన్‌లైన్ బదిలీలతో డబ్బు పంపుతున్నారని తెలుస్తోంది.


వాచీలు ఎలా వచ్చాయి...?

జగన్ ఫొటో ఉన్న ఆ వాచీలు ఎన్నికల స్టంటేనన్నది స్పష్టంగా తెలిసిపోతోంది. ఆ వాచీలు ఎంత మొత్తంలో జిల్లాకు వచ్చాయి..?అవి ఎలా రవాణా చేశారనేది అంతుబట్టడం లేదు. ఆ వాచీలు జిల్లాలోకి ప్రవేశించినప్పుడు పట్టుబడి ఉంటే పరిస్థితి సీరియస్‌గా ఉండేదని, మరో రాష్ట్రంలోకి వెళ్తున్నప్పుడు దొరకడంతో అంత యాక్షన్ ఉండకపోవచ్చనే ప్రచారం జరిగింది. అయితే పెద్ద మొత్తంలోనే వాచీలు తీసుకొచ్చారని సమాచారం. కానీ ఆ వాచీలు జిల్లాలోకి వచ్చే సమయంలో పోలీసులు వాటిని ఎందుకు పట్టుకోలేకపోయారనే ప్రశ్నకు సమాధానం లేదు. ఉమ్మడి జిల్లాలకు సంబంధించి గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులకు పంపాల్సిన డబ్బు రూ.కోట్లలో జిల్లాలోని ఓ కీలకనేత వద్దకు చేరిందని చెప్పుకుంటుంటారు. మరి ఇప్పుడు కూడా చేరిందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.



పట్టుబడిన సాంబశివారెడ్డి వాహనం

జన కేతనం
ఆంధ్రజ్యోతి
అనంతపురం
శ్రీ సత్యసాయి
శుక్రవారం 19 ఏప్రిల్ 2024




అమ్మోరి దయ !

రాజకీయ నాయకులకు బాటసుంకులమ్మ సెంటిమెంట్

గుంతకల్లు నియోజకవర్గంలోని రాజ కీయ నాయకులకు ముందుగా బాట సుంకులమ్మకి పూజలు చేసిన తర్వాతే ఎన్నికల ప్రచారం మొదలు పెట్టడం సెంటిమెంట్‌గా మారింది. మండలంలోని కరిడికొండ గ్రామశివారులో 44వ జాతీయ రహదారి పక్కన వెలసిన బాటసుంకులమ్మ ఆలయానికి ఓ ప్రత్యేకత ఉంది. నియోజకవర్గంలో కర్నూలు జిల్లా సరిహద్దులో ఈ అమ్మవారు దేవుడి (ఈశాన్య) మూలలో ఉంది. అందుకే అధికార పార్టీ, ప్రతిపక్ష రాజకీయ నాయకులు అమ్మవారి దేవాలయానికి వచ్చి పూజలు చేసిన తరువాత పనులు మొదలు పెడతారు. జిల్లానాయకులకు ఏ పదవి వచ్చిన, ఎమ్మెల్యేగా, మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి జిల్లాలో అడుగు పెట్టే ముందు ఈ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన తరువాత వారి నియోజకవర్గానికి వెళ్తుంటారు.

- గుత్తిరూరల్

ఎలా వెళ్లేది?



గుంతలమయంగా వెస్టుగేట్ రోడ్, జిల్లాకేంద్రంలో మట్టిరోడ్డులా మారిన రింగ్‌రోడ్డు (ఇన్‌సెట్‌లో)

కంకరతేలిన సత్యసాయి హాస్పిటల్ నుండి బీడుపల్లి వెళ్లేరోడ్డు.. వెస్టుగేట్‌నుంచి పెద్దకమ్మవారిపల్లి వెళ్లేరోడ్డు




పుట్టపర్తిలో పాడైపోయిన రహదారులు.. మరమ్మతులు పట్టించుకోని వైసీపీ పాలకులు

వైసీపీ పాలకులు తమ ఐదేళ్ల పాలనలో రహదారుల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. పక్క రాష్ట్రాల నుంచి ప్రయాణించే సందర్భాల్లో గుంతల రోడ్డు వచ్చాయంటే ఆంధ్రప్రదేశ్‌లోకి వచ్చి ఉంటాం అని ప్రయాణికులు సెటైర్లు వేసేంతగా ఇక్కడి రోడ్లు ఛిద్రమయ్యాయి. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్దిగాంచిన పుట్టపర్తిలోని రోడ్లు పరిస్థితి నానాటికీ తీసికట్టు అవుతోంది. ఇక్కడ నిర్మించిన అవుటర్ రింగ్ రోడ్డు బీటీ రోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారిపోయింది. అలాగే ఫోర్‌లేన్ రోడ్డు నుంచి ప్రశాంతి నిలయం వెస్టుగేట్ చేరుకోవ డానికి నిర్మించిన రోడ్డు గుంతలమయంగా మారింది. వెస్టుగేట్ రోడ్డు నుండి పెద్దకమ్మవారిపల్లికి వెళ్లే రోడ్డు కంకరతేలి ప్రయాణానికి ఇబ్బంది కలిగిస్తోంది. సత్యసాయి ఆస్పత్రి నుంచి బీడుపల్లి వెళ్లే రోడ్డు కంకర తేలిపోయింది. జిల్లా కేంద్రం ఏర్పడి రెండు సంవత్సరాలు గడుస్తున్నా, స్థానిక వైసీపీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి రోడ్లపై ఉన్న గుంతలకు తట్టెడు మట్టి కూడా వేయించలేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

- పుట్టపర్తి రూరల్

బొమ్మల కథ

కోడ్ వచ్చినా స్మార్ట్ మీటర్లపై తొలగని జగన్ బొమ్మ



మంగాపురంలో వ్యవసాయ బోరుబావికి స్మార్ట్‌మీటర్లపై తొలగని బొమ్మలు

వ్యవసాయ విద్యుత్ మీటర్లకు ఏర్పాటు చేసిన జగన్ బొమ్మలను ఎన్నికల కోడ్ వచ్చినా మండలంలో తొలగించలేదు. ఈ మీటర్లకు జగన్ ఫొటో ఉన్న నవరత్నాల స్టిక్కర్లు అతికించారు. స్మార్ట్‌మీటరుపై వైఎస్ఆర్ ఉచిత వ్యవసాయ పథకం పేరు ఉంది. మండల వ్యాప్తంగా 3వేలకుపైగా స్మార్టు మీటర్లు ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చిన నేపథ్యంలో జగన్ బొమ్మ కానరాకుండా చేయడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. - పెనుకొండ రూరల్

చరిత్ర ఘనం.. సమస్యలు యథాతథం..

- అనంత నగరంలో అభివృద్ధి అంతంతే
- తీరని తాగునీటి సమస్య
- కలగానే డంపింగ్ యార్డు తరలింపు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ



ఉమ్మడి జిల్లా కేంద్రమైన అనంతపురం నియోజకవర్గానికి ఘనమైన చరిత్రే ఉంది. రాష్ట్రంలోనే అనంతపురం అంటే ఎన్నో చారిత్రక ఘట్టాలకు, ఘటనలకు ప్రసిద్ది చెందింది. విశ్వవిద్యాలయాలు, పీటీసీ, ఆర్ట్స్ కళాశాల, టవర్‌క్లాక్, ఇస్కాన్, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి.. ఇలా ఎన్నో ఉన్నాయి. మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా విస్తరించిన అనంతపురం నగరంలో సమస్యలు కూడా అలాగే ఉన్నాయి. పాలకులు మారుతున్నా ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదనే చెప్పాలి. తాగునీటి సమస్య, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, డంపింగ్ యార్డు ప్రతి ఎన్నికల్లోనూ హామీలుగానే మిగిలిపోతున్నాయి.



అనంతపురం క్రైం: తొలుత మున్సిపల్ పట్టణంగా ఉన్న అనంతపురం క్రమంగా విస్తరించింది. తొలిసారిగా 1952లో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి ఎన్నికలు జరిగాయి. మున్సిపాలిటీగా ఉన్న అనంతపురం 2005లో కార్పొరేషన్‌గా రూపాంతరం చెందింది. అనంతపురం నియోజకవర్గ పరిధిలో నగరంలో 50 డివిజన్లు, నాలుగు పంచాయతీలు ఉన్నాయి. అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలో తాజా గణాంకాల మేరకు 2,78,475 మంది ఓటర్లున్నారు. అందులో 1,36,761 మంది పురుషులు, 1,41,679 మంది మహిళలు, 35మంది థర్డ్‌జెండర్లు ఉన్నారు.

మొదటిసారి 1952లో ఎన్నికలు

1952 నుంచి ఇప్పటి వరకు 17సార్లు ఎన్నికలు జరగగా, అందులో రెండుసార్లు ఉప ఎన్నికలు నిర్వహించారు. తొలిసారిగా 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 1969లో అనంతపురం నియోజకవర్గంలో తొలిసారి ఉప ఎన్నికలు జరిగాయి. 2012లో మరోసారి ఉప ఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేయడంతో పాటు వైసీపీని స్థాపించారు. అదే సమయంలో కొందరు ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. అప్పటి అనంతపురం ఎమ్మెల్యేగా ఉన్న గురునాథరెడ్డి రాజీనామా చేయడంతో ఉప ఎన్నిక నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి మహాలక్ష్మి శ్రీనివాసులుపై వైసీపీ అభ్యర్థిగా గురునాథరెడ్డి గెలుపొందారు. 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో సీపీఐ తరఫున టి.నాగిరెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిపై గెలుపొందారు. అనంతపురం నియోజకవర్గం నుంచి టి.నాగిరెడ్డి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1983లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ నుంచి డి.నారాయణస్వామి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బీటీఎల్ఎన్ చౌదరిపై 39,464ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఇప్పటి వరకు అనంతపురం నియోజకవర్గంలో ఇదే అత్యధిక మెజార్టీ. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పి.ఆంథోనిరెడ్డి సీపీఐ అభ్యర్థి గోపాలకృష్ణపై 2,302 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఇదే అత్యల్ప మెజార్టీ. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో అత్యధికులు ముస్లింలు. ఈ సామాజిక వర్గ ఓటర్లు ఎన్నికల్లో కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆ తరువాత బలిజ సామాజికవర్గ ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. కానీ ఈ రెండు సామాజిక వర్గాలకు చెందిన అభ్యర్థులు ప్రధాన పార్టీల నుంచి పోటీ చేయడం లేదు. అనంతపురం నియోజకవర్గాన్ని పలు

సంవత్సరం	విజేత	పార్టీ	సమీప ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1952	తరిమెల నాగిరెడ్డి	సీపీఐ	నీలం సంజీవరెడ్డి	కాంగ్రెస్	11608
1955	పి.ఆంథోనిరెడ్డి	కాంగ్రెస్	ఐ.సదాశివన్	సీపీఐ	7584
1962	పి.ఆంథోనిరెడ్డి	కాంగ్రెస్	బి.గోపాలకృష్ణ	సీపీఐ	2302
1967	తరిమెల నాగిరెడ్డి	సీపీఎం	అనంతవెంకటరెడ్డి	కాంగ్రెస్	2460
1969(ఉ.ఎ)	ఎ.వెంకటరెడ్డి	కాంగ్రెస్	ఐ.సదాశివన్	సీపీఐ	16117
1972	ఎ.వెంకటరెడ్డి	కాంగ్రెస్	కె.ఆర్.రావు	ఇండి	14895
1978	బీటీఎల్ఎన్‌చౌదరి	కాంగ్రెస్ ఐ	మేడా సుబ్బయ్య	జనతా	3335
1983	డి.నారాయణస్వామి	టీడీపీ	బీటీఎల్ఎన్‌చౌదరి	కాంగ్రెస్	39464
1985	ఎన్.రామకృష్ణ	టీడీపీ	ఎ.నారాయణరెడ్డి	కాంగ్రెస్	7421
1989	బి.నారాయణరెడ్డి	కాంగ్రెస్	కె.సైపుల్లా	టీడీపీ	22313
1994	కె.రామకృష్ణ	సీపీఐ	బి.నారాయణరెడ్డి	కాంగ్రెస్	22364
1999	బి.నారాయణరెడ్డి	కాంగ్రెస్	వి.ప్రభాకర్‌చౌదరి	టీడీపీ	3465
2004	బి.నారాయణరెడ్డి	కాంగ్రెస్	కెఎం.రహంతుల్లా	టీడీపీ	37781
2009	బి.గురునాథరెడ్డి	కాంగ్రెస్	మహాలక్ష్మిశ్రీనివాసులు	టీడీపీ	13089
2012(ఉ.ఎ)	బి.గురునాథరెడ్డి	వైసీపీ	మహాలక్ష్మి శ్రీనివాసులు	టీడీపీ	24739
2014	వి.ప్రభాకర్‌చౌదరి	టీడీపీ	బి.గురునాథరెడ్డి	వైసీపీ	9334
2019	ఎ.వెంకటరామిరెడ్డి	వైసీపీ	వి.ప్రభాకర్‌చౌదరి	టీడీపీ	28698



ప్రధాన సమస్యలు

సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. నగరంలోని గుత్తిరోడ్డులో ఉన్న డంపింగ్‌యార్డ్ అత్యంత కీలక సమస్యగా మారింది. ఆ డంపింగ్ యార్డ్ చుట్టుపక్కల నివాసముంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు పడితే అప్పుడు మంటలు రావడం, ఆ వచ్చే పొగతో శ్వాసకోశ వ్యాధిన పడుతున్నారు. పలు కళాశాలలు, భవనాలు సైతం ఇప్పటికే మార్చేశారు. నగరంలో పారిశుధ్య సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది. అనంతపురం నగర పాలికలో ఎంతో మంది పాలకులు, అధికారులు మారినా నేటికీ ఇంటింటి చెత్త సేకరణ జరగడం లేదు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి వర్మికంపోస్టు తయారు చేయించే విషయంలో వెనుకబడుతూనే ఉన్నారు. ఇక నగరంలో పందులు, దోమలు, కుక్కల బెడద చెప్పనలవి కాదు. ఆవులు ప్రధాన రహదారుల్లోనే మందల కొద్దీ తిరుగుతుంటాయి. మురుగు తీయని కాలువలు, మురికి నీరు పారే కాలువలు ఇక్కడ సర్వసాధారణం. నేటికీ కొన్ని రోడ్లు గుంతలుగానే దర్శనమిస్తున్నాయి. అక్రమ కట్టడాలకు అంతే లేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులు లంచావతారుల అవతారమెత్తి ఇష్టారాజ్యంగా అక్రమ భవనాలకు అనుమతిస్తున్నారు. దీంతో సందు లేకుండా పెద్ద పెద్ద భవనాలు వెలుస్తున్నాయి. భవిష్యత్తులో ఇదెలాంటి పరిణామాలకు దారి తీస్తుందో తెలియని పరిస్థితి.

నియోజకవర్గ చరిత్ర

రూ.కోట్లు ఖర్చు పెట్టి అనంతపురం నగరానికి పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్)నుంచి తాగునీటిని అందిస్తున్నప్పటికీ తరచూ పైపులైన్ లీకేజీలతో తాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. వర్షాలొచ్చినప్పుడు నీరు రంగు మారుతున్నాయని ప్రజలు చెబితే.. అది మామూలే అన్నట్లు అధికారులు కొట్టిపడేస్తుంటారు. శుద్ధి చేసి వచ్చే ఆ నీటిని తాగకుండా ఫిల్టర్ వాటర్‌ను నగర ప్రజలు తాగుతున్నారు. వందల సంఖ్యలో ఇబ్బడిముబ్బడిగా వెలిసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లే ఇందుకు నిదర్శనం. వర్షం వస్తే నగరంలోని చాలా కాలనీల్లోకి ఇళ్లల్లోకి మురుగుతోపాటు వర్షపు నీరు చేరుతుంది. గత ఏడాది వరదలు వచ్చిన సమయంలో పలు కాలనీలే నీట మునిగాయి. పన్ను చెల్లిస్తున్నా ప్రజలకు కనీస వసతులు ఉండటం లేదనేది నగర ప్రజల ఆవేదన. నియోజకవర్గంలోని నాలుగు పంచాయతీల్లోనూ ప్రధానంగా తాగునీటి సమస్య అధికంగా ఉంది.

ప్రత్యేకతలు..

అనంతపురం నగరంలో టవర్‌క్లాక్ ఒక ప్రత్యేకమని చెప్పవచ్చు. ఈ చారిత్రాత్మక కట్టడం అనంతపురానికి ఒక తలమానికం. అనంతపురం అర్బన్ నియోజకవర్గ విస్తీర్ణం 1334.60 ఎకరాలు. నియోజకవర్గ పరిధిలో అనంతపురం నగరంలో 50 డివిజన్లు, అనంతపురం రూరల్ మండలంలోని 4 పంచాయతీలు ఉన్నాయి. అనంతపురం నగరానికి 2007లో పెన్నహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్(పీఏబీఆర్) నుంచి నీటిని తీసుకొచ్చి కూడేరు మండలం ముద్దలాపురంలోని ఫిల్టరేషన్ ప్లాంట్‌లో నీటిని శుద్ధి చేసి తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

సిత్రాలు సూడిరో..



అనంతపురం నగరంలోని రాజీవ్ కాలనీలో ప్రచారంలో భాగంగా డోలు కొడుతున్న టీడీపీ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్

దివంగత నేత పరిటాల రవీంద్ర సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ.. కనగానపల్లి మండలం ముత్తువకుంట్ల నుంచి టీడీపీ రాప్తాడు అభ్యర్థి పరిటాల సునీత గురువారం ప్రచారం నిర్వహించారు. తనయుడు పరిటాల శ్రీరామ్, మనవడు జూనియర్ పరిటాల రవీంద్ర ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. తమ కుటుంబంలో ఏ శుభకార్యం తలపెట్టినా ముత్తువకుంట్ల రామాలయంలో పూజలు నిర్వహించి ప్రారంభిస్తామని పరిటాల సునీత అన్నారు. గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రోడ్ షో నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజల సమస్యలను పరిష్కారమౌతాయని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి అండగా నిలవాలని ఆమె గ్రామస్థులను కోరారు. - ధర్మవరం రూరల్





అనంతపురం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ఇది. నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభం కావడంతో ఇక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎండలు మండిపోతుండటంతో వన్ టౌన్ సీఐ రెడ్డెప్ప ఇలా చలివేంద్రంలో కొద్ది సేపు సేదదీరారు.

- అనంతపురం టౌన్



ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ రామాంజనేయులు


సెంటిమంట



గుంతకల్లుకు వస్తే సీఎం పదవి గోవింద!



గుంతకల్లు పట్టణం



గుంతకల్లు నియోజకవర్గ రేఖా చిత్రం

నియోజకవర్గ కేంద్రమైన గుంతకల్లు పేరు చెబితే పదవిలో ఉన్న ఏ రాజకీయ నాయకుడికైనా జడుసుకుంటాడు. అధికారంలో ఉండి గుంతకల్లుకు వస్తే ఉన్న పదవి ఊడిపోతుందని, ముఖ్యమంత్రులు వస్తే వారి పదవులేకాదు, పార్టీ గెలుపుకూడా గోవిందా అనక తప్పదనే నమ్మకం ఉంది. ముఖ్యమంత్రులుగా ఉన్న విజయభాస్కర్ రెడ్డి, చెన్నారెడ్డి, జనార్దన రెడ్డి, చంద్రబాబునాయుడు గుంతకల్లుకు వచ్చిన తర్వాత పదవులు కోల్పోయినవారే. 1983లో విజయభాస్కరరెడ్డి, 1991లో చెన్నారెడ్డి, 1992లో జనార్దనరెడ్డి, 2004లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో గుంతకల్లుకు వచ్చారు. తదనంతరం జరిగిన ఎన్నికల్లో పార్టీలు పరాజయం పొంది విజయభాస్కరరెడ్డి, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి పదవులు కోల్పోయారు. చెన్నారెడ్డి, జనార్దన రెడ్డికి అధిష్టానం కారణంగా పదవులు పోయాయి. ఆర్టీసీ బస్టాండు ప్రారంభోత్సవానికి గుంతకల్లుకు వచ్చిన చెన్నారెడ్డికి ముఖ్యమంత్రి పదవి జారిపోగా, జనార్దనరెడ్డి సీఎం అయ్యారు. జీఎస్‌బీసీలో పాతకొత్తచెరువు వద్ద బైపాస్ కెనాల్ శంకుస్థాపన కోసం చెన్నారెడ్డి గుంతకల్లు రాగా, తదనంతరం పదవి కోల్పోయారు. దీంతో ఆయన స్థానంలో మరో సీల్డు కవర్ ముఖ్యమంత్రిగా కోట్ల విజయభాస్కర రెడ్డి అధికారంలోకి వచ్చారు. అధికారంలో ఉన్న ఏ నాయకుడైనా, ఇతర జిల్లాలకు చెందిన మంత్రులైనా గుంతకల్లుకు వస్తామంటే స్థానిక నాయకులు ఇక్కడి సెంటిమెంటును వారికి చెప్పి వద్దని వారిస్తుంటా రు. అయితే ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖరరెడ్డి, జగన్మోహన్ రెడ్డి తదితరులు గుంతకల్లు వచ్చి తదుపరి ఎన్నికల్లో విజయం సాధించి సీఎం పదవిని అధిష్టించడం గమనార్హం. - గుంతకల్లు

మీరు రావడానికి వీల్లేదు!

మీడియాపై పోలీసు ఆంక్షలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18: ఎన్నికల నామినేషన్ తొలిరోజే పోలీసులు ఆంక్షలు విమర్శల పాలవుతున్నాయి. ప్రత్యేకంగా మీడియాపై కఠినంగా వ్యవహరించారు. కనీసం పౌరసంబంధాల శాఖకు వెళ్లడానికి కూడా అనుమతివ్వలేదు. అనంతపురం నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి ఎమ్మెల్యే అభ్యర్థుల నుంచి నామినేషన్లను గురువారం స్వీకరించారు. గత ఎన్నికల సమయంలోనూ అదే కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించారు. ఆ సమయంలో ఆర్డీఓ కార్యాలయంలోపలికి అందరినీ అనుమతించారు. కానీ ఈసారి పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆర్డీఓ కార్యాలయానికి దూరంగానే బారికేడ్లు పెట్టి అనుమతించకుండా ఆపేశారు. లలితకళాపరిషత్ వైపు, ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ వైపు, నేరుగా ఉన్న మరోదారిని పూర్తిగా మూసివేశారు. టూటౌన్ పోలీసులు విలేకరులను డీపీఆర్వో కార్యాలయంలోపలికి సైతం అనుమతించలేదు. ఉద్యోగుల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. కొందరిని ఐడీ కార్డు చూపిస్తే కానీ లోపలికి అనుమతించలేదు. ఓ మహిళా ఉద్యోగి కార్డు మరచిపోయానని చెప్పినా వినలేదు. మరో దారి నుంచి వెళ్లాల్సి వచ్చింది. ఫారెస్ట్ రేంజ్ సెక్షన్ ఆఫీసర్ రామాంజనేయులు అక్కడున్న మూడు బారికేడ్ల వద్ద ఐడీ కార్డు చూపినా లోపలికి అనుమతించ లేదు. దీంతో తాము విధులెలా నిర్వర్తించాలంటూ అసహనం వ్యక్తం చేశారు. డీఆర్‌డీఏ, డ్వామా, ఫారెస్ట్, హార్టికల్చర్ కార్యాలయాలకు వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



ఆర్డీఓ కార్యాలయం సమీపంలో పోలీసుల ఆంక్షలు



పొమ్మనలేక పొగ పెట్టారా..?

ఇన్‌చార్జిల పేరిట వేరేచోటుకు.. 'పురం' వైసీపీలో విచిత్ర పరిస్థితి

హిందూపురం : సాధారణంగా ఎన్నికల సమయం దగ్గరపడేకొద్దీ ఇతరప్రాంతాల్లో ముఖ్య నాయకులెవరైనా ఆ నియోజకవర్గాలకు చెందిన వారుంటే వారిని రప్పించి ప్రచారాలు నిర్వహించడం రాజకీయ నాయకులు చేసే ప్రక్రియ. కానీ హిందూపురం నియోజకవర్గంలో అందుకు విభిన్నంగా జరుగుతోందని అధికార పార్టీ నాయకులే నివ్వెర పోతున్నారు. నియోజకవర్గంలో మొదటి నుంచి వైసీపీలో అసమ్మతిపోరు రగులుతూనే ఉంది. పార్టీ ఆవిర్భావం నుంచి వైసీపీలో అంతర్గతపోరుతోపాటు అసమ్మతి వర్గం ఎప్పటికీ ఉంది. ప్రస్తుత అభ్యర్థి వర్గం అవలంబిస్తున్న తీరు విచిత్రంగా ఉందని అంటున్నారు. నియోజకవర్గంలో నలుగురు ముఖ్య నేతలుండగా వారిలో ఇద్దరు నేతలను ఎన్నికలు దగ్గరపడేకొద్దీ ఇక్కడ ఉండకుండా బయట నియోజకవర్గాలకు పంపితే తాము ఎన్నికలు చేసుకుంటామని, లేదంటే తమ చేతకాదంటూ అభ్యర్థి దీపికా వర్గం పెద్దిరెడ్డివద్ద వాపోయినట్లు విశ్వసనీయ సమాచారం. వారు నియోజకవర్గంలో ఉంటే తమను ఓడిస్తారని మంత్రి వద్ద మొర పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అధికార పార్టీలో దీనిపైనే చర్చ సాగుతోంది. దీంతో వారిని పొమ్మనలేక ఇన్‌చార్జ్‌ల పేరుతో పంపించేస్తున్నట్లు అధికార పార్టీలో చర్చించుకుంటున్నారు. ఇదే కోవలో హిందూపురం నియోజకవర్గంలో మాజీ సమన్వయకర్తను వేరే నియోజకవర్గంలో ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించారు. మరో నేతను కూడా త్వరలోనే మరో నియోజకవర్గానికి ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పంపుతున్నట్లు ఆ పార్టీలో చర్చ జరుగుతోంది. ఇటీవల నియోజకవర్గంలో కొంతమంది పార్టీని వీడుతుండటం వెనుక ఓ అధికార పార్టీ ముఖ్యనేత హస్తం ఉన్నట్లు మంత్రికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

పురం వైసీపీలో విచిత్ర పరిస్థితి

ఉమ్మడిజిల్లాలో ఎక్కడా లేని విధంగా హిందూపురంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ముఖ్య నేతలను నియోజకవర్గానికి దూరంగా ఉంచుతున్నారు. ఎన్నికల సమయంలో ముఖ్య నేతలు ఉంటే అర్థికపరమైన అంశాలు బయటకు పొక్కుతాయని దీనివల్ల ఒకే వర్గం ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నట్లు సమాచారం. కానీ ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ ఈ నియోజకవర్గంలో వైసీపీ నాయకులను పార్టీలోకి చేర్చుకుని ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రచారంలోకి దింపుతోంది. అధికార పార్టీలో ఉన్న నేతలను బయటకు పంపడం చూస్తే ఇక్కడ రాజకీయం విచిత్ర పరిస్థితి నెలకొందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏది ఏమైనా ముఖ్య నేతలను పొమ్మనలేక ఎన్నికల ఇన్‌చార్జ్‌ల పేరుతో బయటకు పంపడం సర్వత్రా చర్చనీయాంశమయింది.






ప్రచారంలో అభివాదం చేస్తున్న దగ్గుబాటి ప్రసాద్, టీడీపీలో చేరిన బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర, అనుచరులు

అధికారంలోకి వచ్చేది టీడీపీనే..!

జూన్ 9న చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం : కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18: 'ఎవరూ ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దు... వచ్చేది తెలుగుదేశం కూటమి ప్రభుత్వమేనని.. జూన్ 9న చంద్రబాబునాయుడు సీఎంగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. రాసి పెట్టుకోండి..' అని అనంతపురం అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం స్థానిక ఒకటో డివిజన్ పరిధిలోని ఎర్రనేల కొట్టాల, రెవెన్యూ కాలనీ, లెక్చరల్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముస్లిం మైనార్టీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దగ్గుబాటి ప్రసాద్‌కు ఘన స్వాగతం పలికారు. తాము అధికారంలోకి రాగానే డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని దగ్గుబాటి హామీ ఇచ్చారు. అనంత అర్బన్‌లో మైనార్టీల సంపూర్ణ మద్దతు టీడీపీకి ఉందని, ఆ వర్గాలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ స్వరూప, నాయకులు జేఎల్ మురళీధర్, బుగ్గయ్య చౌదరి, మారుతీకుమార్ గౌడ్, ముక్తియార్, కూచి హరి, దళవాయి వెంకటనారాయణ, సైపుద్దీన్, రాయల్ మురళీ, దేవళ్ల మురళీ, చంద్రమౌళి, నెట్టెం బాలకృష్ణ, గోపాల్ గౌడ్, రాజారావు, ఉమర్, వన్నూరప్ప, రఫి,మణికంఠ బాబు, కడియాల కొండన్న, కృష్ణకుమార్, సంగా తేజస్విని, వడ్డే భవాని, ఇమ్రాన్, చాంద్ బాషా, షేక్షా పాల్గొన్నారు.

దగ్గుబాటి శ్రీ లక్ష్మీ ప్రచారం : అనంతపురం అర్బన్ పరిధిలోని 41,47వ డివిజన్లల్లో గురువారం జనసేన రాయలసీమ రీజనల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలతతో కలిసి అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ భార్య దగ్గుబాటి శ్రీ లక్ష్మీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దళవాయి రమాదేవి, వెంకటేష్, శుభహాని, ఈశ్వరమ్మ, శైలజ, గురు లక్ష్మీ, గాయత్రి, సానియా పాల్గొన్నారు.

జేసీ పవన్‌ను కలిసిన దగ్గుబాటి: టీడీపీ అనంతపురం పార్లమెంట్ ఇన్‌చార్జి జేసీ పవన్‌కుమార్‌రెడ్డిని దగ్గుబాటి ప్రసాద్, అంబికా లక్ష్మీనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో తమ గెలుపునకు సహకరించాలని కోరారు.

ప్రియాంక నగర్‌లో ప్రచారం : రాజీవ్ కాలనీ పంచాయతీలోని ప్రియాంక నగర్‌లో దగ్గుబాటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి రాగానే మూడు నెలల్లో డంపింగ్ యార్డు, ఆరు నెలల్లో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిష్ నాగరాజు, ప్రకాష్‌నాయుడు, సుధాకర్ నాయుడు, కుంచెపు వెంకటేష్, సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, బల్లాపల్లవి, నటేష్ చౌదరి, ఫిరోజ్, పోతుల లక్ష్మీనరసింహులు, జయరామిరెడ్డి, పూల బాషా, రఘునాథ్ రాయల్, లింగమయ్యస్వామి, సూర్యనారాయణ, జయమ్మ, నబీ రసూల్ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక: దగ్గుబాటి ప్రసాద్ సమక్షంలో పలువురు కుల సంఘాల నాయకులు టీడీపీలోకి చేరారు. శ్రీనగర్ కాలనీలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు జోగి రాజేంద్ర, కురబ సంఘం యువజన అధ్యక్షుడు చిత్ర నాగరాజు, ఐఎంఎం వ్యవస్థాపక అధ్యక్షుడు మహబూబ్ బాషా, 20వ డివిజన్‌కు చెందిన నాగరాజు, ఆయన అనుచరులను దగ్గుబాటి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాబాఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో దళితుల హత్యాకాండ : వైసీపీ హయాంలో దళితుల హత్యాకాండ జరిగిందని దగ్గుబాటి మండిపడ్డారు. శ్రీనగర్ కాలనీలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... శిరోముండనం కేసులో వైసీపీ నాయకుడు తోట త్రిమూర్తులకు కోర్టు శిక్ష విధించిందని, అలాంటి వ్యక్తిని వైసీపీ నాయకులు కాపాడటం దుర్మార్గమని అన్నారు. వైసీపీ పాలనలో దళితులకు రక్షణ కరువైందన్నారు. ఇప్పటి దాకా రాష్ట్రంలో 6,035 మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే తిరిగి చంద్రబాబు సీఎం కావాలన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

పరిటాల ప్రచారం ప్రారంభం

సెంటిమెంట్ ప్రకారం ముత్తవకుంట్ల నుంచి శ్రీకారం

రామాలయంలో పరిటాల సునీత, శ్రీరామ్ పూజలు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 18: దివంగత నేత పరిటాల రవీంద్ర నుంచి సెంటిమెంట్‌గా వస్తున్న ఎన్నికల ప్రచారాన్ని ఆయన సతీమణి పరిటాల సునీత, తనయుడు పరిటాల శ్రీరామ్ కనగానపల్లి మండలం ముత్తవకుంట్ల నుంచి గురువారం ప్రారంభించారు. గ్రామంలోని రామాలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రచారంలో పరిటాల సునీత మనవడు జూనియర్ పరిటాల రవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. పరిటాల సునీత, శ్రీరామ్ మాట్లాడుతూ ముత్తవకుంట్ల గ్రామం అన్నది మాకు సెంటిమెంట్ అని, తమ కుటుంబంలోని ఏ కార్యక్రమం మొదలు పెట్టినా ముత్తవకుంట్ల రామాలయంలో పూజలు చేసిన అనంతరమే ప్రారంభిస్తామన్నారు. నియోజకవర్గంలోని ముత్తవకుంట్ల గ్రామం నుంచే వైసీపీ పతనం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నెట్టెం వెంకటేష్, కన్వీనర్ యాతం పోతలయ్య, ముకుందనాయుడు, సర్పంచ్ ఈడిగ రామాంజినేయలు, అంజనేయులు పాల్గొన్నారు.

పరిటాల రవీంద్ర ఘాట్‌కు నివాళి

రామగిరి : మాజీ మంత్రి పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్, కుటుంబ సభ్యులతో కలిసి పరిటాల రవీంద్ర ఘాట్‌కు గురువారం ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వెంకటాపురంలో యల్లమ్మ ఆలయంలో, నసనకోట సమీపంలోని తిరుమల దేవర ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రచార రథానికి పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు.

రామగిరి :పరిటాల సునీత గురువారం మండలంలోని గంతిమర్రి, పెనుబోలు, కలికివాండ్లపల్లి గ్రామాల్లో పార్లమెంట్ అభ్యర్థి బీకే పార్థసారధి, పరిటాల శ్రీరామ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. జగన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వనాశనమవుతుందని, రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు రావాలని సూచించారు.పార్టీ అధికారంలోకి వస్తే పేరూరు ప్రాజెక్టుకు నీరందించి గ్రామాలన్నీ సస్యశ్యామలం చేస్తామన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

ఆత్మకూరు: మండలంలోని సింగంపల్లి గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు గురువారం అనంతపురంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరాయి.




ముత్తవకుంట్లలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న పరిటాల సునీత, శ్రీరామ్, గంతిమర్రిలో మహిళలకు కరపత్రాలను అందజేస్తున్న పరిటాల సునీత

ఒంటిమిట్టలో అనంతవాసుల కళాప్రదర్శన



అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 18: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఒంటిమిట్ట రామాలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో అనంత కళాకారులు పాల్గొన్నారు. నగరానికి చెందిన ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ వ్యవస్థాపకురాలు దేవరకొండ కౌసల్య నేతృత్వంలో చిన్నారులు, మహిళలు ఒంటిమిట్ట రామాలయంలో బుధవారం రాత్రి స్వామివారి రథం ముందు సంప్రదాయ నృత్యాలతో పాటు కోలాటంతో ఆకట్టుకున్నారు. ప్రదర్శనానంతరం కళాకారులకు ఆలయ కార్యవర్గం ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.

ఉత్తమ నాయకులనే ఎన్నుకోండి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 18: ఎన్నికల్లో ప్రతి ఓటరు ఓటు హక్కువినియోగించుకుని, ఉత్తమ నాయకులను ఎన్నుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి (డీఎస్‌డీఓ) షఫీ తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్ఓ ఇండోర్‌స్టేడియంలో స్వీప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఓటర్లు చైతన్యం దిశగా తమ ఓటు హక్కును కచ్చితంగా వినియోగించుకుని ఉత్తమ నాయకులను ఎన్నుకుని, సమాజాభివృద్ధికి భాగస్వాములు కావాలని డీఎస్‌డీఓ కోరారు. ఎన్నికల నిఘావేదిక అధ్యక్షుడు కంబదూరు షేక్ నబీరసూల్ మాట్లాడుతూ... క్రమశిక్షణ కలిగిన క్రీడాకారులు తమ ఓటు హక్కును వినియోగించుకుంటూ తల్లిదండ్రులు, ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసీల్దార్ పద్మావతి, పాడుతా తీయగా సింగర్ సుధాకర్, కోచ్‌లు రాఘవేంద్ర, నరేష్‌కుమార్, జెబీవుల్లా, మంజుల, సచివాలయ ఉద్యోగులు జ్యోతి, విష్ణు, క్రీడాకారులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కోచ్‌లు, క్రీడాకారులు

కక్కలపల్లి అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

అనంతపురంరూరల్: మండలంలోని కక్కలపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీఎస్‌డీఎస్ పీడీ శ్రీదేవి గురువారం తనిఖీ చేశారు. కేంద్రంలోని పిల్లల తల్లులు, గర్భవతులు, బాలింతలను సమావేశ పరచి మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఎండలు ఎక్కువగా ఉన్నాయని.. పిల్లలను జాగ్రత్త చూసుకోవాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రూన్సీరాణి, అంగన్‌వాడీ కార్యకర్త సూర్యప్రభ, సహాయకురాలు స్వాతి పాల్గొన్నారు.



ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న పీడీ



చీనీమొక్కలకు రక్షణగా ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ కవర్లు

చీనీమొక్కలకు రక్షణగా ప్లాస్టిక్ కవర్లు

ధర్మవరంరూరల్, ఏప్రిల్ 18: కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లి సమీపంలో రైతు బెస్తచలపతి తన పొలంలో చీనీమొక్కలను కాపాడేందుకు ప్లాస్టిక్ కవర్లు ఏర్పాటు చేశాడు. రికార్డుస్థాయిలో సుమారు 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రైతు బెస్తచలపతి నాలుగు ఎకరాల తన పొలంలో చీనీమొక్కలు సాగుచేస్తున్నాడు. వేడిమికి ఆ మొక్కలు వాడిపోతుండటంతో వాటికి రక్షణగా చుట్టూ కట్టెలు నాటి వాటికి ప్లాస్టిక్ కవర్లు తొడిగాడు. దీని కోసం రూ.లక్ష వరకు ఖర్చు అయినట్లు ఆ రైతు తెలిపాడు.

డీసీఓగా బాధ్యతలు స్వీకరించిన అరుణకుమారి

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 18: జిల్లా సహకార శాఖ అధికారిగా (డీసీఓ)గా అరుణకుమారి నియమితులయ్యారు. ఇదివరకు పనిచేస్తున్న డీసీఓ ప్రభాకర్‌రెడ్డి డీఎల్‌సీఓగా తిరిగి వెళ్లారు. కడపలో డీఎల్‌సీఓగా పనిచేస్తున్న అరుణకుమారి పదోన్నతిపై అనంతపురం డీసీఓగా బదిలీ చేశారు. రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు డీసీఓగా అరుణకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకే జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో ఇన్‌చార్జి డీసీఓగా, హిందూపురం డీఎల్‌సీఓగా అరుణకుమారికి పనిచేసిన అనుభవం ఉంది. అరుణకుమారి ఎన్నికల విధుల్లో భాగంగా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో మానిటరింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు.



అరుణకుమారి



పాతకల్లూరులో టీడీపీలో చేరిన 50 వైసీపీ కుటుంబాలు

వైసీపీ పతనం ఖాయం: బండారు శ్రావణి శ్రీ

గార్లదిన్నె, ఏప్రిల్ 18 : వైసీపీ పార్టీకి పతనం ఖాయమని శింగనమల నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి బండారు శ్రావణి శ్రీ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం గార్లదిన్నె మండలం పాతకల్లూరు గ్రామంలో శింగనమల నియోజకవర్గం ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డితో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన ప్రముఖ నాయకులు పుల్లారెడ్డి, చంద్రాయుడు, నాగరాజు, రాము తదితరులతో పాటు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ.... వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధిని పూర్తిగా మరిచిపోయారన్నారు. ధనార్జనే ధ్యేయంగా దోచుకో....దాచుకో అన్న చందంగా వైసీపీ పాలన సాగించారన్నారు. ఇలాంటి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముంటిమడుగు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు విశాలాక్షి, గుర్రం ఆదినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇల్లూరు రామాంజి, వడ్డేర సామితి జిల్లా అధ్యక్షుడు వన్నూర్, గుత్తాబాలకృష్ణ, సుంకన్న, వడ్లరాము, బాబయ్య, రమణప్ప, మాజీ ఎంపీటీసీ శీనా, ఓబిరెడ్డి, శివశంకర్‌రెడ్డి, సంగప్ప, అంజి, ఆవుల శీనా, సామల మధు, వెంకటేసు, శేఖర్, జగదీష్, అశోక్, గంగాధర్, నాగేంద్ర, గుత్తాహరి, చల్లారాజు పాల్గొన్నారు.

ఆలం ప్రచారం

నార్పల: ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీ నారాయణను గెలపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసా నాయుడు పేర్కొన్నారు. నార్పల మండలంలోని గడ్డంనాగేపల్లి, కర్తపుడికి గ్రామాల్లో గురువారం విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఆలం వెంకట నరసా నాయుడు, నాయకులు ఆకుల ఆంజనేయులు, ఆలం నాగార్జున నాయుడు, ఎర్రినాగప్ప, చంద్రబాబు, లక్ష్మీనాయుడు, నాగార్జున, వెంకటేష్, బాలయ్య, రమేష్, ప్రసాద్, వెంకటనాయుడు, ఈశ్వరయ్య, మల్లికార్జున, రవి, నాగరాజు, రామాంజి, గోపాల్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చీనీకాయలు టన్ను రూ.36 వేలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 18: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.26 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 753 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

పశుపోషణపై జాగ్రత్తలు పాటించాలి

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 18: వేసవిని దృష్టిలో ఉంచుకొని పశుపోషణపై పలు జాగ్రత్తలు పాటించేలా రైతులకు సూచనలు ఇవ్వాలని పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. గురువారం స్థానిక పశుసంవర్థక శాఖ జేడీ కార్యాలయంలో వెటర్నరీ డాక్టర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వేసవి నేపథ్యంలో పశుపోషణకు పాటించాల్సిన పద్ధతులను వివరించారు.

నగరపాలిక ఎంహెచ్‌ఓగా విష్ణుమూర్తి బాధ్యతలు

అనంతపురం క్రైం, ఏప్రిల్ 18 : నగరపాలిక ఎంహెచ్‌ఓగా విష్ణుమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. విష్ణుమూర్తి గతంలో యాడికి, పెద్దపప్పూరు, గుత్తిలో వైద్యఆరోగ్య శాఖ పరిధిలో పనిచేశారు. విష్ణుమూర్తి నగర కమిషనర్ మేఘస్వరూప్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇదివరకు ఇన్‌చార్జ్ ఎంహెచ్‌ఓగా సంగం శ్రీనివాసులు పనిచేశారు.

23 నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 18: ఎస్కేయూ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ జీవీ రమణ గురువారం తెలిపారు. రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దాదాపు 22వేల మంది పరీక్ష ఫీజు చెల్లించారని, వారి హాల్ టికెట్స్ జ్ఞానభూమి పోర్టల్ ద్వారా కళాశాలల ప్రిన్సిపాల్స్ లాగిన్‌కు పంపామని తెలిపారు. పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్స్‌గా ఆయా కేంద్రాల ప్రిన్సిపాల్స్ వ్యవహరిస్తారని తెలిపారు.

అనంత చేరిన పరిశీలకులు

అనంతపురం టౌన్, : ఎన్నికలలో అభ్యర్థులు, పార్టీల ఖర్చులను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ నియమించిన వ్యయ పరిశీలకులు ఐఆర్ఎస్ విలాస్ వి.షిండే గురువారం అనంతపురం నగరానికి చేరుకున్నారు. ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బస చేసిన ఆయనను జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎన్నికల పక్రియ గురించి షిండే అడిగి తెలుసుకున్నారు.



ఘనంగా ది వెరిడియన్ వార్షికోత్సవం

అనంతపురం రూరల్, ఏప్రిల్ 18: కూడేరు మండలం గొట్కూరు సమీపంలోని 'ది వెరిడియన్ ఎకోల్ స్కూల్' వార్షికోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ హాజరయ్యారు. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీకృష్ణ, పాఠశాల చైర్మన్ మాసినేని రామయ్య, కరస్పాండెట్ లక్ష్మీదేవి, ప్రిన్సిపాల్ సుధ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ



▲ విద్యార్థుల నృత్య ప్రదర్శన ▼



సింగంపల్లిలో టీడీపీ ప్రచారం

ఆత్మకూరు ఏప్రిల్ 18: మండలంలోని సింగంపల్లి గ్రామంలో గురువారం మండల టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు అనీల్ చౌదరి, క్రిష్ణమోహన్ చౌదరి, నారాయణస్వామి, పరుశురామ్, శశాంక చౌదరి, కుళ్ళాయప్ప, నరసింహచౌదరి, నాగేంద్ర, రామదాసు, అక్కులన్న పూల ఓబులపతి, ఆనంద్ పాల్గొన్నారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

సింహవాహనంపై ఊరేగిన రాములోరు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 18: శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజైనా గురువారం మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో రాములవారు సింహవాహనంపై ఊరేగారు. ఉదయం సీతారాములకు వివిధ అభిషేకాలు, సహస్ర నామార్చన నిర్వహించారు. సాయంత్రం విశేషంగా అలంకరించిన రథంలో సింహవాహనంపై స్వామివారి ఉంచి.. పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణంలోని వేదికపై నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మహిళలు కోలాటం ఆడారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.




← సింహవాహనంపై రాములవారు, కోలాటమాడుతున్న మహిళలు

చంద్రబాబు వస్తేనే రాష్ట్రానికి రాజధాని

రాప్తాడు, ఏప్రిల్ 18: వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి రాజధాని ఏర్పాటు అవుతుందని మాజీ మంత్రి పరిటాల సునీత సోదరుడు, రాప్తాడు మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. అయ్యవారిపల్లి గ్రామంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నారాయణ స్వామి, గంగలకుంట రమణ, ఉప్పర శ్రీనివాసులు, సర్పంచ్‌లు తిరుపాలు, మరూరు గోపాల్, ఇంద్ర, సాకే జయరాముడు, హంపాపురం జయప్ప, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, బీరన్న, మరూరు కదిరయ్య, పాల్గొన్నారు.

కార్యకర్తలు భయపడొద్దు.. అండగా ఉంటా

● ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం


మాట్లాడుతున్న గుమ్మనూరు జయరాం చిత్రంలో ప్రభాకర్‌చౌదరి, జితేంద్రగౌడు

గుంతకల్లు, ఏప్రిల్ 18: స్థానిక ఎమ్మెల్యే పెడుతున్న కేసుల భయంతో పలువురు టీడీపీ నాయకులు తటస్థంగా ఉండిపోయారని, కార్యకర్తలకు తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. గురువారం ఉదయం పట్టణంలోని ఏటీ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. భారీ ఎత్తున జరిగిన ఈ సదస్సుకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వైకుంఠం ప్రభాకర చౌదరి, మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడు ముఖ్య అతిథిలుగా విచ్చేశారు. జయరాం మాట్లాడుతూ తనకు పార్టీ టిక్కెట్టిస్తే చంద్రబాబు నాయుడు కాళ్లు పట్టుకుని సీటు సాధించానని ఎమ్మెల్యే వెంకట రామిరెడ్డి ఎద్దేవా చేశారన్నారు. ఒక్క టిక్కెట్టుకే తాను కాళ్లు పట్టుకుంటే, వెంకట రామిరెడ్డి సోదరులు అన్ని టిక్కెట్లు పొందారుకదా, జగన్‌కు మీరేం పట్టుకున్నారని ప్రశ్నించారు. బీసీ అయిన తనను అంత చులకనగా మాట్లాడున్నాడని, బీసీల ఓట్లతోనే గెలిచిన విషయం మరువవద్దని హెచ్చరించారు. ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ టిక్కెట్టు వచ్చినా రాకపోయినా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయడం తమ నైజమన్నారు. శ్రీనాథ్‌గౌడు, గుమ్మనూరు నారాయణ స్వామి, బండారు ఆనంద్, కేసీ హరి, బీఎస్ కృష్ణారెడ్డి, ముష్టూరు తిమ్మప్ప, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, గుత్తి అబ్దుల్ జిలాన్ పాల్గొన్నారు.

ఐదేళ్లూ అబద్ధాలే..: వైసీపీ అధికారంలోకి వచ్చింది మొదలు ఐదేళ్లూ అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అపద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గుమ్మనూరు జయరాం, అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని నల్లదాసరి పల్లి, నెలగొండలో ప్రజాగళం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. గుమ్మనూరు వెంకటేశులు, తలారి మస్తానప్ప, ముష్టూరు తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

గుత్తి: పట్టణంలోని టీడీపీ కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోదరుడు నారాయణ ఆధ్వర్యంలో గురువారం 50 కుటుంబాలతో పాటు 50 మంది ఆటో డ్రైవర్లు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. గుత్తి ఆర్ఎస్‌లోని 8వ వార్డు సుందరయ్య కాలనీలో ఆ కాలనీకి చెందిన నాగరాజు సమక్షంలో 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి గుమ్మనూరు నారాయణ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వార్డు ఇన్‌చార్జి అబ్దుల్‌వహబ్, న్యాయవాది సోమశేఖర్, ప్రసాద్, ప్రతాప్, రవి, పాల్‌రాజు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

కృష్ణాపురంలో జేసీ అశ్మిత్‌రెడ్డి ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న అశ్మిత్‌రెడ్డి, టీడీపీ నాయకులు

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 18: పట్టణంలోని కృష్ణాపురం రోడ్డులో గురువారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కదిరి శ్రీకాంత్‌రెడ్డి, బీజేపీ కన్వీనర్ రంగనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు ప్రసాద్‌నాయుడు, నరేంద్ర నాయుడు, విజ్జి, పవన్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీ రంగనాథస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బ్రహ్మసముద్రం, ఏప్రిల్ 18: మండలంలోని వేపులపర్తిలో వెలసిన లక్ష్మీ రంగనాథ స్వామి రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. లక్ష్మీదేవి రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధుల గుండా ఊరేగించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి రథాన్ని ముందుకు లాగారు.

ఆంజనేయస్వామి...

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 18: మండలంలోని కొండాపురం గ్రామంలో గురువారం అంజనేయస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీరామనవమి పురస్కరించుకుని స్వామివారికి ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పాలంకరణ, వస్త్రాలంకరణ తదితర పూజలు చేశారు. ప్రత్యేకంగా పూలతో అలంకరించి రథంలో స్వామివారి ప్రతిమను ప్రతిష్ఠించి గ్రామ పురవీధుల్లో రథాన్ని లాగారు. భక్తులకు పానకాల బండ్ల ఊరేగింపు నిర్వహించారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

పురవీధుల్లో ఊరేగిన పార్వతీపరమేశ్వరులు

కూడేరు, ఏప్రిల్ 18: జోడులింగాల సంగమేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెడ్డి సంఘం ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరులు గ్రామపురవీధుల్లో విహరించారు. గురువారం ఉదయం ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరులు శేషవాహనంలో గ్రామపురవీధుల్లో ఊరేగించారు. వేడులకును తిలకించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.


శేషవాహనంపై దర్శనమిస్తున్న స్వామి, అమ్మవార్లు

భక్తిశ్రద్ధలతో గంగ పూజ

విడపనకల్లు, ఏప్రిల్ 18: మండల కేంద్రంలో వెలసిన సుంకులమ్మ దేవి, దేవమ్మదేవి, రథోత్సవ వేడుకలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గంగపూజ కార్యక్రమం నిర్వహించి స్థానిక గౌరమ్మ బావి నుంచి గంగపూజ ఉత్సవం ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి ఆలాయానికి చేర్చారు.

23 నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 18: ఎస్కేయూ ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి డిగ్రీ పరీక్షలు నిర్వహిస్తామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ జీవీ రమణ గురువారం తెలిపారు. రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ పరీక్షలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దాదాపు 22వేల మంది పరీక్ష ఫీజు చెల్లించారని, వారి హాల్ టికెట్స్ జ్ఞానభూమి పోర్టల్ ద్వారా కళాశాలల ప్రిన్సిపాల్స్ లాగిన్‌కు పంపామని తెలిపారు.

13 మంది వలంటీర్ల రాజీనామా

బెళుగుప్ప, ఏప్రిల్ 18: మండలంలోని కాలవపల్లి సచివాలయ పరిధిలో ఒకరు, గంగవరంలో 12 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేసినట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. సచివాలయ సెక్రెటరీలకు రాజీనామా పత్రాలు అందించి, సెల్‌ఫోన్లు, సిమ్‌లు, రికార్డులను స్వాధీనం చేశారన్నారు.

కళ్యాణదుర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

● కూటమి అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 18: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. గురువారం కుందుర్పి మండల ఎస్ మల్లాపురం, మల్లాపురం తండా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, మహిళలు, గ్రామస్థులు పూలవర్షం కురిపించి గజమాలలతో అమిలినేనికి ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ కళ్యాణదుర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. బీటీపీ కాలువను పూర్తి చేసి కుందుర్పి బ్రాంచ్ కెనాల్ ద్వారా ప్రజలకు తాగు, సాగునీటిని అందిస్తానని హామీ ఇచ్చారు. వలసలను పూర్తిగా నివారించి కళ్యాణదుర్గం ప్రాంతంలో


మహిళలతో కలసి ప్రచారాన్ని చేపడుతున్న కోడలు ఇషిత


రోడ్‌షోలో ప్రజలకు విక్టరీ గుర్తు చూపుతున్న అమిలినేని సురేంద్రబాబు

పరిశ్రమలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానన్నారు. మే 13న ప్రతి ఒక్కరు ఓటును వేసి టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రచారంలో అమిలినేని కుటుంబ సభ్యులు

కళ్యాణదుర్గం మండలం హులికల్లు గ్రామంలో అమిలినేని సురేంద్రబాబు కుటుంబ సభ్యులుఎన్నికల ప్రచారాన్ని గురువారం చేపట్టారు. సురేంద్రబాబు కోడలు ఇషిత ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. గ్రామాలు అభివృద్ధి పథంలో నడవాలంటే ఒక్క టీడీపీతోనే సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రతి ఒక్కరు గెలుపునకు అహర్నిశలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో టీడీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు.

వైసీపీ చేసిన అభివృద్ధి శూన్యం: కేశవ్

విడపనకల్లు, ఏప్రిల్ 18: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో అభివృద్ధి చేసింది శూన్యమని ఎమ్మెల్యే, పయ్యావుల కేశవ్ అన్నారు. మండలంలోని చీకలగురికి, ఉండబండ, పాల్తూరు, హావళిగి, కరకముక్కల, మాళాపురం, గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్‌షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా పయ్యావుల కేశవ్ మాట్లాతూ ప్రతి పల్లెలోను తాగునీటి సమస్యలు ఉన్నా ఒక్కటి కూడా పరిష్కరించలేదన్నారు. ఎక్కడా ఒక్క సిమెంట్ రోడ్డు వేయలేదని, డ్రైనేజీలు వేయలేదని అన్నారు. పాల్తూరు గ్రామంలో రైతులకు సొసైటీ ద్వారా ఇచ్చిన ఎరువులను వైసీపీ నాయకులు పక్కదారి పట్టించి రూ.లక్షలు దోచుకుతిన్నారని విమర్శించారు. హావళిగిలో జగనన్న కాలనీకి భూమి కొనుగోలు చేసి ఓ వైసీపీ నాయకుడికి రూ.కోట్లు దోచి పెట్టారన్నారు. పేదల అభివృద్ధి మరచి వైసీపీ నాయకులు వారి అభివృద్ధిని చూసుకున్నారన్నారు. హావళిగి రూ.7.5కోట్లతో ఐదు గ్రామాలకు తాగునీరు అందించే తాగునీటి నీటి ట్యాంక్‌ను నిర్మిస్తామన్న నాయకులు ఎన్నికల ముందు టెండర్లు పిలిచి మండల ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి కావాలన్నా, ప్రతి పల్లె అభివృద్ధి పథంలో నడవాలన్నా టీడీపీకి మీ ఓటు వేయాలని అభ్యర్థించారు. మండల నాయకులు బీడీ చిన్న మారయ్య, మాజీ ఎంపీపీ, లాయర్ ప్రతాప్


పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరుతున్న ఉరవకొండ తోపుడు బండ్ల సంఘం నాయకులు


రోడ్ షోలో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

నాయుడు, దేవేంద్ర, భీమలింగప్ప, లక్ష్మీరెడ్డి, రాజా రెడ్డి, వెంకటేశులు, నారాయణస్వామి పాల్గొన్నారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు టీడీపీ రంగుతో తయారు చేయించిన చర్నాకోల్‌ను నాయకులు అందించారు.

పయ్యావుల కేశవ్‌ను ఆశీర్వదించండి

ఉరవకొండ: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌ను ఆశీర్వదించాలని తనయుడు విజయ్‌సింహా ఓటర్లను అభ్యర్థించారు. మండలంలోని షేక్షానుపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, ఎంపీటీసీ రామలింగ, టీడీపీ నాయకులు చలపతి రామలింగ, రఘురాములు పాల్గొన్నారు.

టీడీపీలోకి తోపుడు బండ్ల నాయకులు: పట్టణానికి చెందిన ఈశ్వర్, అల్లా తోపుడు బండ్ల నాయకులు టీడీపీలోకి చేరారు. కౌకుంట్ల గ్రామంలో తోపుడు బండ్ల సంఘం నాయకులు చక్రధర్, శ్రీరాములు, లింగన్న, నాగేంద్ర, షణ్ముఖ, రాజులకు పయ్యావుల శ్రీనివాసులు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

కూడేరు: మండలంలోని మరుట్ల 2వ కాలనీకి చెందిన పలువురు వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం మరుట్ల వైసీపీకి చెందిన గుడూరు రామన్న, గుడూరు మహేష్, గొల్ల ఎర్రిస్వామి, కమ్మర నెట్టికంటయ్యలకు పయ్యావుల శ్రీనివాసులు కండువాలు కప్పారు. వారితోపాటు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుమ్మఘట్ట, ఏప్రిల్ 18: మండలం నేత్రపల్లి వద్ద భూపసముద్రం ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం బోల్తా పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు బ్రహ్మసముద్రం మండలం ముద్దలాపురం గ్రామానికి చెందిన వీరేష్(29) గురువారం ఉదయం 75 వీరాపురం గ్రామానికి వివాహానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ప్రమాదం చోటు చేసుకుంది. మృతుడికి భార్య నవ్యశ్రీ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

పాము కాటుతో బాలిక...

గుమ్మఘట్ట, ఏప్రిల్ 18: మండలంలోని 75 వీరాపురం గ్రామ సమీపం బోయలదొడ్డి గ్రామంలో బుధవారం రాత్రి ఆరుబయట నిద్రిస్తుండగా అవంతి(12) అనే బాలికను పాముకాటు వేసింది. వెంటనే తల్లిదండ్రులు వెంకటేశులు, మహాలక్ష్మి కుటుంబసభ్యులు బాలికను చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించేలోగా మార్గ మధ్యలో మృతి చెందింది. బాలిక స్థానిక పాఠశాలలో ఏడవ తరగతి చదువుతోంది. బాలిక మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు.

పూరి గుడిసె దగ్ధం... ఎద్దు మృతి

పామిడి, ఏప్రిల్ 18: మండలంలోని రామగిరి ఎగువతండా గ్రామంలో గురువారం తెల్లవారుజామున లక్ష్మక్క, రాక్రే నాయక్ పూరి గుడిసె విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ ఘటనలో ఎద్దు, మూడు మేకలు, స్ప్రింక్లర్లు, పైపులు, వంట సామాగ్రి, దుస్తులు, ధాన్యం కాలి బూడిదైనట్లు బాధితుడు వాపోయారు. రూ.3లక్షలు నష్టం వాటిల్లినట్లు తెలిపాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ కలెక్టర్ ఆర్ కృష్ణానాయక్ తమ్ముడు ఆర్ రమేష్ నాయక్ రూ.5వేల చెక్కును అందజేశారు.

మొక్కజొన్న పంట దగ్ధం

పుట్లూరు, ఏప్రిల్18: మండలంలోని చింతకుంట గ్రామంలో రైతు నారాయణరెడ్డికి చెందిన మొక్కజొన్నపంట విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. బాధిత రైతు తెలిపిన మేరకు 4 ఎకరాల్లో పంటను సాగుచేశానని, చేతికి వచ్చే సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగి రెండు ఎకరాల్లో పంట కాలిపోయినట్లు తెలిపారు. డ్రిప్పు, పైపులు కూడా దగ్ధమయ్యాయి. రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

పకడ్బందీగా నామినేషన్ల ప్రక్రియ

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 18: మొదటి రోజు నామినేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు. నామినేషన్లు వేయడానికి వచ్చిన అభ్యర్థులకు వంద మీటర్ల మేర బారికేడ్లను ఏర్పాటు చేశారు. గురువారం శెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందిన రంగరాజుల గోపీనాథ్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రాణి సుష్మిత తెలిపారు. ఆర్డీవో, రెవెన్యూ కార్యాలయం, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం ఆవరణంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. మీడియాను కూడా లోపలికి అనుమతించలేదు.

ఎన్నికలకు సర్వం సిద్ధం: ఆర్వో

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 18: నియోజకవర్గంలో మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆర్వో, ఆర్డీఓ శ్రీనివాసుల రెడ్డి తెలిపారు.ఆర్డీఓ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ గురువారం నుంచి అమలులోకి వచ్చిందన్నారు. ఈ నోటిఫికేషన్ వల్ల ఈనెల 18నుంచి 25వరకు ఎన్నికల నామినేషన్ పత్రాలను స్వీకరణ జరుగుతుందన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్టు

బొమ్మనహాళ్, ఏప్రిల్ 18: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం భారీ ఈదురుగాలులతో కూడిన కొద్దిపాటి వర్షం కురిసింది. ఉంతకల్లు క్రాస్ సమీపం లోని బళ్లారి-కళ్యాణదుర్గం రహదారిపై వేపచెట్టు ఈదురుగాలులకు నేలకొరిగింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. రోడ్డుపై చెట్టు విరిగి పడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు చెట్టును పక్కకు తొలగించారు. దీంతో రాకపోకలు కొనసాగాయి.


రహదారిపై విరిగిపడిన చెట్టు

నెట్టికంటి సన్నిధిలో రైల్వే బోర్డు అదనపు సభ్యుడు

గుంతకల్లు, ఏప్రిల్18: రైల్వే బోర్డు అదనపు సభ్యుడు (ట్రాక్షన్) విజయ్ ప్రతాప్ సింగ్, ఆయన సతీమణితో కలసి కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పూజలు చేశారు. గురువారం ఉదయం కసాపురం ఆలయానికి వెళ్లిన విజయ్ ప్రతాప్ సింగ్ దంపతులకు అర్చకులు సాదరంగా ఆహ్వానించి స్వామివారి సన్నిధిలో పూజలు చేయించి, పట్టు వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం పలికారు. గుంతకల్లు డీఆర్ఎం వినీత్ సింగ్, తదితర సబార్డినేట్ అధికారులు పాల్గొన్నారు.


విజయ్ ప్రతాప్ సింగ్ దంపతులను సత్కరిస్తున్న అర్చకులు

ట్రాక్షన్ షెడ్ పరిశీలన: డివిజనల్ కేంద్రానికి వచ్చిన రైల్వే బోర్డు అదనపు సభ్యుడు విజయ్ ప్రతాప్ సింగ్ నిర్మాణంలో ఉన్న విద్యుత్ లోకో షెడ్డును పరిశీలించారు. పెండింగులో ఉన్న పనుల గురించి అధికారులను ప్రశ్నించారు. అనంతరం స్థానిక రైల్వే ఉన్నత పాఠశాలకు వెళ్లి తాను గుంతకల్లులో డీఆర్ఎంగా పనిచేసిన కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమానికి సంబంధించిన ఫొటోల ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

వైసీపీ ప్రచారంలో పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగి


వైసీపీ నాయకుల స్వాగతంలో కాంట్రాక్ట్ ఉద్యోగి విశ్వనాథ్

పామిడి, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేయాలంటూ గుంతకల్లు శాసనసభ్యుడు వెంకట్రామిరెడ్డి అల్లుడు మంజునాథరెడ్డి గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. మూడవ వార్డులోని వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, నాయీ బ్రాహ్మణవీధి, చైతన్య కాలనీలలో ప్రచారం చేశారు. వీకే ఆదినారాయణరెడ్డి కాలనీలోకి వైసీపీ నాయకులకు స్వాగతం పలుకుతున్న సమయంలో గ్రామ పంచాయతీ కాంట్రాక్ట్ ఉద్యోగి విశ్వనాథ్ ఉండడం విశేషం. అలాగే ఈ ప్రచారంలో ఎండీయూ శివయ్య పాల్గొన్నారు.

పశువుల ఆసుపత్రి స్థలం విక్రయంపై చర్యలు తీసుకోండి

యాడికి, ఏప్రిల్18: మండల కేంద్రంలో పశువుల ఆసుపత్రి ఉన్న స్థలం విక్రయంపై చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు అధికారులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫిర్యాదుమేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న సర్వేనెంబరు 519సీలో పశువైద్యశాల ఉండేదని పేర్కొన్నాడు. 6 సెంట్లకు పైగా స్థలం ఉంది. ఇక్కడ సెంట్ రూ.20లక్షలకు పైమాటే పలుకుతుండడం గమనార్హం. దీనిని ఒక వ్యక్తి ఆక్రమించుకొని విక్రయం చేశాడని పేర్కొన్నాడు. దీనిపై చర్యలు చేపట్టి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై ఈఓపీఆర్డీ వెంకటేష్‌ను వివరణ కోరగా 519సీ ప్రభుత్వ పశువుల ఆసుపత్రి స్థలం విక్రయం జరిగిందని దీనిపై చర్యలు చేపట్టాలని కోరుతూ ఫిర్యాదు ఇచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. స్థలం ఎవరిది అని నిర్ణయంపై మండల సర్వేయర్‌కు రెఫర్ చేయనున్నట్లు తెలిపారు. ఈ స్థలం ఆక్రమించుకొని అమ్మకం జరిపింది వైసీపీ మండల నాయకుడేనని దుమారం రేగుతోంది. సదరు నాయకుడు గుత్తిలో రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఫిర్యాదుతోపాటు రిజిస్ట్రేషన్ విక్రయ పత్రాలను జతపరిచాడు. ఎన్నికల నేపథ్యంలో వైసీపీ నాయకుడి ఇమేజ్ ఎక్కడ డామేజ్ అవుతుందోనని ఫిర్యాదును అధికారులు బయటకు రానీయకపోవడం గమనార్హం.


వైసీపీ నాయకుడు విక్రయించినట్లు చెబుతున్న పశువుల ఆసుపత్రి (గతంలో) స్థలం ఇదే

టీడీపీ నాయకులపై వైసీపీ దాడి

● మున్సిపల్ మాజీ చైర్మన్ వైపీ రమేష్‌కు గాయాలు

● కళ్యాణదుర్గంలో ప్రచారం చేస్తుండగా కవ్వింపు చర్యలు

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 18: నియోజకవర్గ కేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలపై వైసీపీ వర్గీయులు గురువారం దాడికి దిగారు. టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం జరుగుతుండగా.. వాహనాన్ని అడ్డు నిలిపి కవ్వింపు చర్యలకు దిగారు. టీడీపీ నాయకులు సంయమనం పాటించినా వినుకోలేదు. అడ్డుగా ఉన్న వాహనాన్ని తియ్యమన్నందుకు పిడిగుద్దులు కురిపించారు. వారి దాడిలో మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ నాయకులు వైపీ రమేష్ గాయపడ్డారు. దీంతో ఆయనను అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కళ్యాణదుర్గం పట్టణంలోని ఎర్రనేల వీధిలో టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు గురువారం ఉదయం ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. అదే సమయంలో వైసీపీ నాయకులు ఓ వాహనంలో అక్కడికి వచ్చి టీడీపీ నాయకుల ప్రచారాన్ని అడ్డుకున్నారు. ఎంత నచ్చజెప్పినా వినకుండా వాహనాన్ని అడ్డుపెట్టి దౌర్జన్యానికి దిగారు. నానా దూర్భషలాడుతూ టీడీపీ వర్గీయులపై దాడికి దిగారు. పోలీసులు వచ్చినా వైసీపీ వర్గీయులు తగ్గలేదు. మున్సిపల్ మాజీ చైర్మన్ వైపీ రమేష్‌పై పిడిగుద్దులు కురిపించడంతో ఆయన అక్కడే సొమ్మసిల్లిపడిపోయారు. ఆయనను వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఓటమి భయంతోనే తమపై వైసీపీ నాయకులు దాడికి దిగారని అమిలినేని సురేంద్రబాబు అన్నారు. ప్రశాంతంగా ఉన్న కళ్యాణదుర్గంలో అలజడి సృష్టించేందుకు వైసీపీ నేతలు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల అధికారుల అనుమతి తీసుకుని ప్రచారం చేసుకుంటున్న తమపై వైసీపీ వర్గీయులు ఉద్దేశపూర్వకంగా దాడికి పాల్పడ్డారని అన్నారు. దాడికి పాల్పలడ్డవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణ సీఐ హరినాథ్‌కు ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు అల్లుడు అవినాష్ ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


వైసీపీ వర్గీయుల దాడిలో సొమ్మసిల్లిన టీడీపీ నాయకుడు వైపీ రమేష్


గాయపడ్డ వైపీ రమేష్‌ను అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న టీడీపీ వర్గీయులు

చంద్రబాబు బర్త్‌డే జరుపుకోవడం మా అదృష్టం

● మాజీ మంత్రి కాలవ శ్రీనవాసులు



రాయదుర్గం, ఏప్రిల్ 18: రాష్ట్రంలో 175 నియోజకవర్గాలుండగా అందులో రాయదుర్గం నియోజకవర్గంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు బర్త్‌డే వేడుకలు జరుపుకోవడం తమ అదృష్టమని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. కణేకల్లు క్రాసింగ్ వద్ద హెలీప్యాడ్ పనులను పరిశీలించిన అనంతరం గురువారం విలేకరులతో మాట్లాడారు. అత్యంత వెనుకబడి నిత్య కరువు ప్రాంతమైన రాయదుర్గాన్ని బాగుచేయడానికి చంద్రబాబు రూ.4500 కోట్లు నిధులు ఇచ్చారన్నారు. అందులో కొన్ని కార్యక్రమాలు పూర్తికాగా మరికొన్ని ఆగిపోయాయన్నారు. శనివారం చంద్రబాబు పుట్టిన రోజు అని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నామినేషన్

రాయదుర్గం రూరల్, ఏప్రిల్ 18: మొదటిరోజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎంబీ చిన్నప్పయ్య నామినేషన్‌ను గురువారం అందించినట్లు ఆర్ఓ కరుణకుమారి తెలిపారు. ఎన్నికల నిబంధనల మేరకు మొదటిరోజు కాంగ్రెస్ పార్టీ తరపున చిన్నప్పయ్య నామినేషన్‌ను అందించారన్నారు.

బలవంతపు కండువాలే వైసీపీ నైజమా?

బొమ్మనహాళ్, ఏప్రిల్ 18: టీడీపీ కార్యకర్తలకు, మద్దతు దారులకు బలవంతంగా వైసీపీ కండువాలు వేసి చెప్పుకోవడమే వారి నైజమా అని మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ కొత్తపల్లి మహేంద్ర అన్నారు. మండలంలోని ఉంతకల్లు గ్రామంలో నేసే గోపాల్‌కు వైసీపీ నాయకులు బలవంతంగా కండువా వేసి పార్టీలో చేరినట్లు చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. గురువారం గోపాల్ తిరిగి టీడీపీ గూటికి చేరారు. బలవంతంగా వైసీపీ కండువా వేశారని దీన్ని మనస్సు ఒప్పుకోక సొంతగూటికి చేరానని చెప్పారు. పయ్యావుల నాగరాజు, దిలీప్, మాజీ సర్పంచ్ సులేమాన్ పాల్గొన్నారు.


గోపాల్‌కు టీడీపీ కండువాను వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మహేంద్ర

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 18: పట్టణ సమీపంలోని బీటీపీ లేఅవుట్ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. గుమ్మఘట్ట మండలానికి చెందిన గోవిందు, గోవిందప్ప, వెంకటేష్ అనే ముగ్గురు రాయదుర్గం నుంచి ద్విచక్ర వాహనంలో పూలకుంటకు వెళుతుండగా పట్టణంలోని బీటీపీ లేఅవుట్ సమీపంలో వీరాపురం నుంచి రాయదుర్గం వైపున వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడటంతో స్థానికులు గమనించి రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఫ్లయింగ్ స్క్వాడ్‌పై ఉన్నతాధికారుల విచారణ

బెళుగుప్ప, ఏప్రిల్ 18: మండలంలో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిపై ఉన్నతాధికారుల విచారణ చర్చనీయాంశంగా మారింది. వారం రోజుల క్రితం మండలంలోని గుండ్లపల్లి వద్ద స్క్వాడ్ వాహనాలు తనిఖీచేస్తూ గొర్రెలను, మేకలను తరలిస్తున్న వాహనాన్ని ఆపి రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాహనదారులు ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లారు. ఉన్నతాధికారి స్క్వాడ్ టీమ్‌ను విచారించగా తాము కాదని పోలీసులే వసూళ్లకు పాల్పడ్డారని సమాధానం ఇవ్వడంతో జిల్లా అధికారి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమ సిబ్బంది ప్రమేయం లేకున్నా ఈ సమస్య నుంచి బయట పడేందుకు తమ శాఖపై నెడుతున్నారని నేరుగా గొర్రెల వాహనదారున్ని విచారించాలని స్థానిక ఎస్ఐ కోరడంతో పోలీసుల ప్రమేయం లేదని స్క్వాడ్ టీం అధికారులు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు విచారణలో తేలింది.